గురువారం
23-02-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 242
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పైకి లేచేది మళ్లీ శిథిలమయ్యేందుకు కాదు

వరుస భూకంపాలతో టర్కీ అస్తవ్యస్తమైంది. శిథిలాల కింద గుట్టలుగా శవాలు ఉంటే ఇప్పటికే మృతుల సంఖ్య 47వేలను దాటింది. వేలాది మంది చిన్నారులు తీవ్రస్థాయిలో ప్రభావితమయ్యారు. ఈ క్రమంలో అంకారాలో టర్కీ కమ్యూనిస్టు పార్టీ భారీ సంఘీభావ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. పైకి లేస్తున్నది మరోమారు శిథిలాల్లో చిక్కుకొని ఉక్కిరిబిక్కిరి అయ్యేందు కాదని ఉద్ఘాటించింది.

2లో

కమలం కకావికలం

- కేంద్రంలో తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్నా ఏపీలో బలహీనపడుతున్న విచిత్ర పరిస్థితి
- బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు 'కన్నా' నిష్క్రమణ
- అదేబాటలో మరికొందరు నేతలు
- అసంతృప్తితో రగులుతున్న కమలనాథులు
- రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయమే కారణం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఏపీలో బీజేపీ పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. కేంద్రంలో 9ఏళ్లుగా ఆ పార్టీ అధికారంలో కొనసాగుతున్నా...రాష్ట్రంలో ఏమాత్రం ఆ పార్టీ పుంజుకోకపోగా బలహీనపడుతోంది. సహజంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి కిందిస్థాయిలో బలపడటానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తొలుత ఆ ఉద్దేశంతోనే కాంగ్రెస్, టీడీపీ నుంచి కేంద్ర మాజీమంత్రులు, ఎంపీలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర బీజేపీ అధినేతల తీరుతో వారిని కూడా పార్టీలో ఇముడ్చుకోలేని విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ఏపీలో బీజేపీ పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. రాష్ట్ర విభజనకు కాంగ్రెస్‌తో భాగస్వామి అయిన బీజేపీ... ఆ తర్వాత విభజన అంశాలు అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం కనబర్చింది. విభజన చట్టం ప్రకారం పార్లమెంటు హామీలు, విభజన అంశాల అమలుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవల్సి ఉండగా, 9 ఏళ్లు పూర్తయినా ఇప్పటివరకు ఏ ఒక్క అంశం కూడా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఇప్పటికీ వాటిని పూర్తి చేయాలన్న సంకల్పం కేంద్ర ప్రభుత్వంలో కానరావడం లేదు. పైగా అమరావతి రాజధానికి స్వయంగా శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, దాని విధ్వంసానికి వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సహకారం అందిస్తున్నారు. 2015లో విజయదశమి పండుగ సందర్భంగా అమరావతి రాజధానికి శంకుస్థాపన చేసిన మోదీ... ఇప్పటివరకు దాని గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. రాజధాని ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి సుమారు 22 సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించింది. వాటిల్లోనూ ఇప్పటివరకు ఏ ఒక్క నిర్మాణాన్నీ చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పాట పాడుతూ అమరావతి విధ్వంసానికి శతవిధాలా ప్రయత్నిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం అది మన దేశంలో భాగం కాదన్నట్లుగా చోద్యం చూస్తోంది. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు తమకు న్యాయం చేయాలని మూడేళ్లుగా ఉద్యమిస్తున్నారు. దానిని అణచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వేల సంఖ్యలో రైతులపై అక్రమకేసులు బనాయించింది. కనీసం మహిళలనే కనికరం లేకుండా వారిపై పోలీసులు జులుం ప్రదర్శించి భయభ్రాంతులకు గురి చేసేలా వ్యవహరించారు. ఉద్యమంలో పాల్గొనే మహిళలందరిపై దాదాపు కేసులు నమోదు చేశారు. అయినా ఒక్కరోజు కూడా మోదీ స్పందించలేదు. పైగా హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాల్సిన సందర్భంలో రాజధానిపై నిర్ణయం రాష్ట్రానిదే అంటూ కేంద్రం తన అభిప్రాయాన్ని వెల్లడి చేస్తూ రాజధాని సమస్యకు ఆజ్యం పోసింది. అమరావతి రాజధానికే కట్టుబడి ఉన్నామని రాష్ట్ర బీజేపీ శాఖ బొంకుతుండగా, కేంద్ర పెద్దలు మాత్రం ప్రభుత్వ అభిప్రాయం వేరు, పార్టీ అభిప్రాయం వేరు అంటూ విచిత్ర వాదనలు వినిపిస్తున్నారు. అలాగే ఏపీకి అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టుకి పెరిగిన అంచనా ప్రకారం నిధులు విడుదల చేయకుండా నానా తిప్పలు పెడుతోంది. పార్లమెంటు సాక్షిగా నాటి ప్రధాని ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని తుంగలో తొక్కింది. ఇక కడప ఉక్కు పరిశ్రమ, విశాఖ రైల్వే జోన్, లోటు బడ్జెట్ భర్తీ, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు, దుగరాజపట్నం పోర్టు, విజయవాడ, విశాఖ మెట్రో రైలు, అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే, అమరావతి ఓఆర్ఆర్, రాజధాని నిర్మాణానికి నిధులు వంటి అనేక విభజన అంశాలకు కేంద్రం తిలోదకాలిచ్చింది. కేంద్ర విద్యా, వైద్య సంస్థలకు సంబంధించి ఇప్పటివరకు ఏ ఒక్క సంస్థకూ పూర్తిస్థాయి నిధులు మంజూరు చేయలేదు. దీనిపై పార్లమెంటులో ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే, ఏపీకి ఎంతో చేశామని తప్పుడు లెక్కలు చెపుతూ రాష్ట్ర ప్రజలను కేంద్ర మంత్రులు మోసగిస్తున్నారు. దానికి రాష్ట్ర బీజేపీ నేతలు తందానా పలుకుతున్నారు. కేంద్ర బీజేపీ నేతల తరహాలోనే రాష్ట్ర కమలనాథులు కూడా కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా పార్టీని బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు తప్ప, రాష్ట్రానికి చెప్పుకోవడానికి ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా అమలు చేయని పరిస్థితి నెలకొంది. దీంతో రాష్ట్ర కమలనాథులు పైకి బింకంగా వాదనలకు దిగుతున్నా, అంతర్గతంగా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. దీనిలో భాగంగానే ఇటీవల బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పార్టీ నుంచి నిష్క్రమించారు. ఆయన ఈనెల 23వ తేదీన టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకున్నారు. ఆయన బాటలోనే మరికొందరు కమలనాథులు పార్టీని వీడే పరిస్థితి కనపడుతోంది. ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుపై పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. ఆయనతోపాటు ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మరో ఇద్దరు నేతలు పార్టీలో పెత్తందారీతనాన్ని చూపిస్తున్నారని, వాటిని భరించలేకున్నామంటూ అసమ్మతివాదులు గగ్గోలు పెడుతున్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ తప్పిదాలను ఎండగడుతూ పార్టీని బలోపేతం చేయాల్సిన

- మిగతా 2 లో

దిల్లీ మేయర్ పీఠం ఆప్‌దే

మేయర్‌గా షెల్లీ ఒబెరాయ్, డిప్యూటీగా ఇక్బాల్

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీ మేయర్ పీఠం ఎట్టకేలకు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) దక్కించుకుంది. మేయర్ పీఠం కోసం ఆప్, బీజేపీ మధ్య హోరాహోరీ యుద్ధం జరిగింది. చివరికి ఆప్ విజయం సాధించింది. బీజేపీ అభ్యర్థి రేఖా గుప్తాపై 34 ఓట్ల తేడాతో ఆప్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ గెలుపొందారు. మొత్తం 266 ఓట్లు పోల్ కాగా షెల్లీ ఒబెరాయ్‌కు 150 ఓట్లు, రేఖా గుప్తాకు 116 ఓట్లు లభించాయి.కాగా డిప్యూటీ మేయర్ పదవి కూడా ఆప్‌నే వరించింది. ఆప్ అభ్యర్థి ఆలే మహ్మద్ ఇక్బాల్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. బీజేపీ అభ్యర్థి కమల్ బగ్రీపై ఇక్బాల్ 31 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్బాల్‌కు మొత్తం 147 ఓట్లు రాగా బగ్రీకి 116 లభించాయి. మేయర్, డిప్యూటీ మేయర్ ఫలితాలను అధికారులు అధికారికంగా ప్రకటించారు. దీంతో ఆప్ శ్రేణులు సంబరాల్లో మునిగితేలాయి. కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించిన ఈ ఎన్నికల్లో కొత్త మేయర్‌గా ఎన్నికైన షెల్లీ ఒబెరాయ్‌కు దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా అభినందనలు తెలిపారు. 'ప్రజలు గెలిచారు. దిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఆప్‌ను గెలిపించిన కార్యకర్తలు, ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆప్ తొలి మేయర్ షెల్లీ ఒబెరాయ్‌కు హృదయపూర్వక అభినందనలు' అని ఇద్దరూ ట్వీట్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల

- మిగతా 2 లో

ఏడాదికి రెండుసార్లు లా నేస్తం

2,011 మంది న్యాయవాదులకు కోటి 55 లక్షల విడుదల

లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: జూనియర్ న్యాయవాదులు తమ వృత్తిలో స్థిరపడేంత వరకు అండగా నిలుస్తూ 'లా నేస్తం' భరోసానిస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన జూనియన్ న్యాయవాదులు 2,011 మంది ఖాతాల్లో రూ.1,00,55,000ను బుధవారం క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి సీఎం జమ చేశారు. జగన్ మాట్లాడుతూ చదువు పూర్తిచేసుకుని న్యాయవృత్తిలోకి వచ్చిన వారు మొదటి మూడేళ్లు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం తోడుగా ఉందనే భరోసా ఇవ్వడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. వృత్తిలో ఊతమివ్వడంతో పాటు

- మిగతా 2 లో

ఎన్నికల కోడ్ జగన్‌కు వర్తించదా?: రామకృష్ణ

2లో

నిర్వాసితులకు రూ.90 కోట్లు ఇవ్వలేరా?

- పోలవరానికి నిధులివ్వని కేంద్రం
- బీజేపీ గెలుపు కోసం ఎగువభద్రకు నిధులు
- రామకృష్ణ విమర్శ
- తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు సందర్శించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర–విజయనగరం/గుర్ల: వెనుకబడిన ప్రాంతాలు, రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనడానికి తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టే నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో ప్రభుత్వమే చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బుధవారం విజయనగరం జిల్లాలో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టును సీపీఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు నిధులివ్వకుండా మోదీ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.2900 కోట్లు కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం వివాదాస్పద ఎగువభద్ర ప్రాజెక్టుకు మోదీ ప్రభుత్వం రూ.5300 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. అదే సమయంలో జాతీయ ప్రాజెక్టు పోలవరానికి మాత్రం నిధులివ్వడం లేదన్నారు.

రాయలసీమకు అన్యాయం జరుగుతుందని తెలిసినా ఎగువ భద్రకు నిధులిచ్చారన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతమని పదేపదే చెప్పే పాలకులు రూ.739 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుకు ఎందుకు నిధులివ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 49 గ్రామాలకు సాగునీరు, విజయనగరం పట్టణానికి తాగునీరు అందుతుందన్నారు.

ఇంతటి ప్రాధాన్యత గల ప్రాజెక్టుకు నిధులివ్వకపోవడం సిగ్గుచేటన్నారు. జగన్ ప్రభుత్వం ప్రాజెక్టులు, రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. తారకరామా ప్రాజెక్టుకు సంబంధించి రూ.90 కోట్లతో మూడు ముంపు గ్రామాల బాధితులకు పునరావాసం కల్పించవచ్చన్నారు. పోలవరం నిర్వాసితులకు రూ.29 వేల కోట్లివ్వాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్రమంటూ మాట్లాడే మంత్రి ధర్మాన ప్రసాదరావు వెనుకబడిన ప్రాంతాల్లో ప్రాజెక్టుల గురించి ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులు సందర్శించి విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని రామకృష్ణ తెలిపారు. ప్రాజెక్టులపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ముందుగా తారకరామ ప్రాజెక్టు స్థితిగతులను, పురోగతిని ప్రాజెక్టు డీఈ రమణ రామకృష్ణకు వివరించారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, ఈశ్వరయ్య, అక్కినేని వనజ, డేగా ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు ఎ.విమల, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, ఎన్.నాగభూషణం, బాయి రమణమ్మ, బుగత పావని, జిల్లా సమితి సభ్యులు పొందూరు అప్పలరాజు, పురం అప్పారావు, డేగల అప్పలరాజు, ఎస్.సునీల్, కె.స్రవంతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు బి.రవికుమార్, పి.గౌరీశంకర్, అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మజ్జి సూరప్పడు, సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదీ లోకం!

ఏంటీ? ఇక్కడంతా గ్రాడ్యుయేట్ ఓటర్లంటే నమ్మలేకపోతున్నారా మన ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాల్కెడ ఏడ్చాయి?

రాష్ట్ర విభజనపై విచారణ మళ్లీ వాయిదా



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్ర విభజన అంశానికి సంబంధించి బుధవారం విచారణ చేపడతామని చెప్పిన సుప్రీంకోర్టు మళ్లీ వాయిదా వేసింది. రాజ్యాంగ ధర్మాసనాలు కొన్ని ప్రత్యేక కేసులు విచారిస్తున్నందున ఈ కేసును వాయిదా వేసింది. బుధ, గురువారాల్లో కేవలం నోటీసులు ఇచ్చిన పిటిషన్లపై, తుది విచారణలో ఉన్న పిటిషన్లను మాత్రమే వాదనలకు తీసుకోవాలని ఇటీవల సుప్రీంకోర్టు ప్రత్యేక నిబంధన తీసుకువచ్చింది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయం, రాజ్యాంగ ధర్మాసనాల కారణంగా రాష్ట్ర విభజనపై దాఖలైన పిటిషన్ల విచారణ వాయిదా పడింది. రాష్ట్ర విభజనపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, తెలంగాణ వికాస్ కేంద్రం సహా మరికొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయడం, దీనిపై గతంలో విచారణకు వచ్చినప్పుడు ఈనెల 22వ తేదీ విచారిస్తామని త్రిసభ్య

- మిగతా 2 లో

న్యాయ కమిషన్ పదవీ కాలం పొడిగింపు

అంతర్జాతీయ విమానయానంలో సవరణల ధ్రువీకరణ

భారత్-గయానా విమాన సర్వీసు ఒప్పందం

కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూదిల్లీ : దేశ 22వ న్యాయ కమిషన్ పదవీ కాలాన్ని ఆగస్టు 31, 2024 వరకు పొడిగించడంతో పాటు అంతర్జాతీయ విమానయాన సదస్సులో సవరణలపై ప్రోటోకాల్‌ల ధ్రువీకరణకు, భారత్-గయానా మధ్య విమాన సర్వీసు ఒప్పందంపై సంతకం చేయడానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక అధికార ప్రకటన పేర్కొంది. '22వ న్యాయ కమిషన్ చైర్‌పర్సన్, సభ్యులు ఇటీవల కార్యాలయంలో చేరారు. అనేక పెండింగ్ ప్రాజెక్టుల పరిశీలన, నివేదికను

- మిగతా 2 లో

మాజీ ఎమ్మెల్యేలు కిడారి, సివేరి హత్యకేసులో ప్రధాన నిందితుడు శ్రీనుబాబు అరెస్టు

14 రోజుల రిమాండ్‌కు మావోయిస్టు నేత

విశాలాంధ్ర - పాడేరు (అల్లూరి జిల్లా): మాజీ ఎమ్మెల్యేలు కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమలే హత్య కేసులో ప్రధాన నిందితుడు, మావోయిస్టు నేత జనుమూరు శ్రీనుబాబును సీలేరు పోలీసులు అరెస్టు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో మావోయిస్టులు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో శ్రీనుబాబు అలియాస్ రైనో అలియాస్ సునీల్ పట్టుబడినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనుబాబును బుధవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించగా అతనిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్లు వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి ఐఈడీ, తుపాకీ, పేలుడు సామగ్రి, విప్లవ సాహిత్యం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీనుబాబు ఏవోబీ ప్రత్యేక జోన్ డివిజనల్ కమిటీ సభ్యుడని, ఏవోబీలో అనేక హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నట్టు వెల్లడించారు. ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అతనిపై రూ.5లక్షల రివార్డు ఉన్నట్లు చెప్పారు. మంగళవారం ఆంధ్రా, ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిపిన కూంబింగ్ క్రమంలో మావోయిస్టులు తారసపడి ఎదురు కాల్పులు జరిగినట్లు జిల్లా ఎస్పీ

- మిగతా 2 లో

పైకి లేచేది మళ్లీ శిథిలమయ్యేందుకు కాదు..

టర్కీ కమ్యూనిస్టు పార్టీ

అంకారా: వరుస భూకంపాలతో టర్కీ అస్తవ్యస్థమైంది. శిథిలాల కింద గుట్టలుగా శవాలు ఉంటే ఇప్పటికే మృతుల సంఖ్య 47వేలను దాటింది. వేలాది మంది చిన్నారులు తీవ్రస్థాయిలో ప్రభావితమయ్యారు. ఈ క్రమంలో అంకారాలో టర్కీ కమ్యూనిస్టు పార్టీ భారీ సంఘీభావ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. పైకి లేస్తున్నది మరోమారు శిథిలాల్లో చిక్కుకొని ఉక్కిరిబిక్కిరి అయ్యేందు కాదని ఉద్ఘాటించింది. 'పైకి తేస్తున్నాం... మళ్లీ శిథిలమయ్యేందుకు కాదు' అని నినాదమిచ్చింది. టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) ప్రధాన కార్యదర్శి కెమెల్ ఓక్యుయన్ ప్రారంభోపన్యాసం చేశారు. టర్కీ ప్రజలు కుటుంబాలు, ఇళ్లు, జ్ఞాపకాలు... సర్వం కోల్పోయారని దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని ఉంటే ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు వీలు ఉండేదని, అలాగే బాధితులకు సమయానికి సాయం అందినా కొన్ని ప్రాణాలైనా కాపాడే అవకాశముండేదని అభిప్రాయపడ్డారు. అయితే ఇందుకోసం ప్రణాళికలు ముఖ్యమని నొక్కిచెప్పారు. ప్రణాళికలు లేనందునే ఇంతటి ప్రాణ-ఆస్తి నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. హేతుబద్ధ ఆలోచనలకు, శాస్త్రీయతకు వ్యతిరేకలని టర్కీ ప్రభుత్వవర్గాలను దుయ్యబట్టారు. ఆర్థిక వ్యవస్థనే కాదు ప్రజల ప్రాణాలు కాపాడటానికి కూడా ప్రణాళికలు ఎంతో అవసరమన్నారు. సిరియాలోనూ తీవ్ర నష్టం వాటిల్లిందని ఆ దేశ ప్రజలకు సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ సంఘీభావం తెలిపింది. టర్కీ, సిరియా భూకంప బాధితులకు గ్రీస్ కమ్యూనిస్టు యువత (కేఎన్ఈ) సంఘీభావాన్ని ప్రకటించింది. బాధితులకు అండగా నిలుస్తామని పేర్కొంది. సిరియాపై అమెరికా, నాటో, ఈయూ

భయానక ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని ర్యాలీ డిమాండ్ చేసింది.

భూకంప ఫాలోఅప్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం: భూకంప ఫాలోఅప్ కేంద్రాన్ని తమ శక్తిసామర్థ్యాల మేరకు ప్రభావిత ప్రాంతాల అవసరాలు, ప్రజలకు దీర్ఘకాల ఫలితాలు ఇచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని ఓక్యుయన్ ప్రకటించారు. శుభ్రమైన గాలి-వెలుతురు వచ్చేలా జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. తమతో ప్రతి ఒక్కరు కలిసిరావాలని పిలుపునిచ్చారు. శిథిలాల నుంచి బయటకు వచ్చి తిరిగి స్వీయసమృద్ధి దేశంగా మారుదాం... మన దేశాన్ని శక్తిమంతం చేసుకుందాం... అని ఓక్యుయన్ నినాదమిచ్చారు.

'బ్లింకెన్ గో హోమ్'

- అమెరికా-నాటో స్థావరాల తొలగింపుకు గ్రీక్ కమ్యూనిస్టుల డిమాండ్
- ఏథెన్స్, థెస్సలోనికిలో భారీ నిరసన ప్రదర్శన

ఏథెన్స్: గ్రీస్‌లో అమెరికా కార్యదర్శి ఆంటోనియో బ్లింకెన్ పర్యటనను గ్రీక్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ), గ్రీస్ కమ్యూనిస్టు యువత (కేఎన్ఈ) తీవ్రంగా ఖండించాయి. సరిహద్దు ప్రాంతంలో అమెరికా-నాటో ప్రణాళికలు తమ దేశానికి ప్రమాదకరంగా నొక్కిచెప్పాయి. ఉక్రెయిన్‌లో నాటో, రష్యా యుద్ధం క్రమంలో ఆ దేశ సైనిక కార్యకలాపాలను గ్రీస్ కమ్యూనిస్టులు నిరసించారు. 'బ్లింకెన్ గో హోమ్' నినాదాలు చేశారు. ఏథెన్స్, థెస్సలోనికిలో నాటో స్థావరాల ఏర్పాటును వ్యతిరేకించారు. సామ్రాజ్యవాద చర్యల్లో జోక్యం వద్దు, గ్రీస్‌లో నాటో-అమెరికా స్థావరాలు వద్ద అంటూ వేలాది మంది యువతీ, యువకులు, కమ్యూనిస్టులు నిరసన గళాన్ని వినిపించారు. అమెరికా దౌత్యకార్యాలయం వరకు మార్చ్ నిర్వహించారు. గ్రీస్‌లో 'యుద్ధ మంత్రి' అమెరికాకు ప్రవేశం లేదని నినాదాలు చేశారు. తమ దేశంలో అమెరికా-నాటో స్థావరాలను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. థెస్సాలోనికిలోనూ భారీ నిరసన ప్రదర్శన జరిగింది. 'థెస్సాలోనికి ప్రజల పోర్టు... సామ్రాజ్యవాదుల స్థావరం కాదు', ప్రజా హంతకులకు నీరు లేదు, భూమి లేదు' అన్న నినాదాలు మార్మోగాయి. సిటీసెంటర్‌లోని అమెరికా రాయబార కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. కేకేఈ ఎంపీలు జియన్నిస్ దెలిస్, లియోనిదాస్ స్టోడిసిస్, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ర్యాలీలో పాల్గొన్నారు.

కులవివక్షకు సీటెల్ చెక్

దానికి వ్యతిరేకంగా తీర్మానం చేసిన తొలి అమెరికన్ నగరం

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో కులవివక్షకు చరమగీతం పాడేలా తీర్మానం చేసిన తొలి నగరంగా సీటెల్ నిలిచింది. భారతీయ సంతతి అమెరికన్ రాజకీయ నాయకులు, ఆర్థికవేత్త క్షమా సావంత్ ప్రవేశపెట్టిన తీర్మానానికి సీటెల్ సిటీ కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. దీంతో కుల వివక్షకు వ్యతిరేకిస్తూ తీర్మానం చేసిన తొలి నగరంగా సీటెల్ చరిత్రకు ఎక్కబోతోంది. ఆరు ఓట్లతో ఈ తీర్మానం ఆమోదం పొందింది. ఇది అధికారికమని, దేశంలో తొలిసారిగా వివక్షపై నిషేధం విధించడం చరిత్రాత్మక నిర్ణయమని సావంత్ అన్నారు. ఈ ఉద్యమాన్ని దేశవ్యాపితం చేయాలని నొక్కిచెప్పారు.

ఓటింగ్‌కు కొన్ని గంటల ముందే తన మద్దతును భారత సంతతి అమెరికాన్ కాంగ్రెస్‌ఉమెన్ ప్రమీలా జయపాల్ ప్రకటించారు. అమెరికా సహా ప్రపంచంలో ఎక్కడా వివక్షకు తావు ఉండకూడదని అన్నారు. కొన్ని కాలేజీలు, యూనివర్సిటీలు కుల వివక్షను నిషేధించాయని చెప్పారు. కార్మికులు తమ హక్కులు, గౌరవం కోసం పోరాడుతున్నారని గుర్తుచేశారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న 'ఈక్వాలిటీ ల్యాబ్స్' తాజా చర్యను స్వాగతించింది. సీటెల్‌లో కుల వివక్షకు తీర్మానం వెనుక ఈక్విటీ ల్యాబ్స్ ఉంది. 'విద్వేషంపై ప్రేమ విజయం సాధించింది. సీటెల్‌లో ఇది రుజువు అయింది. కుల వివక్షకు చెక్ పెట్టే దేశంలోని మొదటి నగరంగా నిలవబోతోంది. ఎన్నో అత్యాచారాలు-హత్యల బెదిరింపులను ఎదుర్కొన్నాం' అని పేర్కొంది. కుల వివక్ష వ్యతిరేకోద్యమానికి 200కుపైగా సంస్థల మద్దతిస్తున్నాయి.

ఎన్నికల కోడ్ జగన్‌కు వర్తించదా?

రామకృష్ణ సూటిప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ఆర్ లా నేస్తం కింద 2011 మంది జూనియర్ న్యాయవాదులకు చెల్లించింది కేవలం రూ.1.55 కోట్లు కాగా దీని ప్రచారం కోసం కోటి రూపాయలు వెచ్చించడమేమిటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది ప్రజాధనాన్ని దుర్వినియోగపరచడం కాదా? అని నిలదీశారు. ఎమ్మెల్సీ ఎన్నికల వేళ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండగా డబ్బు ఎలా పంపిణీ చేస్తారని, సీఎం జగన్‌కు ఎన్నికల కోడ్ వర్తించదా అని ధ్వజమెత్తారు. ఈ మేరకు రామకృష్ణ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల ప్రకటన విడుదలైనందున కోడ్ అమలులో ఉందని గుర్తుచేశారు. అయినా సీఎం జగన్ లా నేస్తం పథకం కింద నిధులు జమచేస్తున్నట్లు పత్రికల్లో ప్రకటనలు గుప్పించారని మండిపడ్డారు. ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి ప్రచార ఆర్భాటానికి తెరలేపారని, యువ న్యాయవాదుల ఓట్లను వైసీపీ అనుకూల అభ్యర్థులకు వేయించే పథకంలో భాగమే లా నేస్తం నిధుల జమ అనేది బహిరంగ రహస్యమని పేర్కొన్నారు. తక్షణమే లా నేస్తం ప్రకటనలపై ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జగన్ తన ప్రచార ఆర్భాటాలకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని, వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన కార్యాలయాలకు వైసీపీ రంగులు వేయించిన విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసినప్పటికీ చీమకుట్టినట్లయినా లేకపోవడం విచాకరమని ఆయన పేర్కొన్నారు. ఆఖరుకు ప్రభుత్వ ఆసుపత్రులలోని ప్రిస్క్రిప్షన్‌పైనా జగన్ బొమ్మ వేయించడం చూస్తుంటే 'జగన్ ప్రచార పిచ్చి' పరాకాష్ఠకు చేరినట్లుందని మండిపడ్డారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటు హక్కును వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ అనుకూల అభ్యర్థులను చిత్తుగా ఓడించి ప్రజాస్వామిక శక్తులను గెలిపించాలని కోరారు.

మోదీ సాయంతోనే అదానీ దోపిడీ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

విశాలాంధ్ర, హైదరాబాద్: భారతదేశ ఆర్థిక వ్యవస్థను అతలా కుతలం చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రమాదంలోకి నెడుతున్న అదానీ ఆర్థిక మోసాలపై సెబీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు కేసులు పెట్టడానికి బదులుగా కాపలా కాస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తీవ్రంగా విమర్శించారు. అదానీ వ్యవహారంపై ప్రపంచమంతా గగ్గోలు పెడుతుంటే ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా మాత్రం వ్యతిరేకంగా మాట్లాడే వాళ్ల నోళ్లు మూయించేస్తున్నారని అన్నారు. తక్షణమే అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) లేదా సుప్రీం కోర్టు న్యాయమూర్తి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25 నుంచి 27 వరకు పాండిచ్చేరిలో జరిగే సీపీఐ జాతీయ సమితి సమావేశాలలో దేశంలోని రాజకీయ పరిస్థితులు, రాబోయే సార్వత్రిక ఎన్నికలపై చర్చిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ మఖ్దూం భవన్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నర్సింహలతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వీధి కుక్కలపై గోల ఎక్కువైందని, అంతకు మించి దేశానికి ప్రమాదకారిగా మారిన అదానీ గురించి దృష్టి సారించాలని నారాయణ పేర్కొన్నారు. మోదీ సహాయం లేకుండా ప్రపంచ కుబేరుల జాబితాలో అదానీ రెండవ స్థానానికి చేరడం సాధ్యం కాదని అన్నారు. గతంలో అదానీకి అప్పులు ఇవ్వమని చెప్పిన ప్రధాని మోదీ... ఆస్ట్రేలియాలో గనులు ఇప్పించి, అదానీకి ఎస్‌బీఐ నుంచి అప్పు ఇప్పించారని అన్నారు. తాలిబాన్లకు అదానీకి సంబంధాలు ఉన్నాయని, వారు పండించే గంజాయిని అదానీకి చెందిన ముంద్రా పోర్టు ద్వారా దిగుమతి చేసుకొని దేశమంతా సరఫరా చేస్తారని చెప్పారు. అందుకు వీలుగా దేశంలోని వివిధ పోర్టులను అదానీకి కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం సహకరించిందన్నారు. జీవీకే సంస్థను బెదిరించి ముంబై ఎయిర్ అదానీకి కట్టబెట్టారని అన్నారు. అదానీ పోర్టులకు రవాణా సౌకర్యం కల్పించేందుకే కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున హైవేలను నిర్మిస్తోందన్నారు. దండకారణ్యంలోని ఖనిజాలను తీసుకెళ్లేందుకు ఛత్తీస్‌గఢ్ నుండి దక్షిణాదిలో పోర్టులకు హైవేలు వేస్తున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి సంబంధించిన 30 వేల ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డుగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అక్కడ నుంచి దక్షిణ భారత దేశాన్ని కంట్రోల్ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఒక్క ముంద్రా పోర్టును సీజ్ చేస్తే భారతదేశమంతటా డ్రగ్స్ సరఫరా కాకుండా నిరోధించవచ్చన్నారు.

నిందితుడు శ్రీనుబాబు అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయం తెలిపింది. కాగా కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమలే 2018 సెప్టెంబరు 23న హత్యకు గురయ్యారు. శ్రీనుబాబు 2000 సంవత్సరంలో మావోయిస్టు పార్టీలో చేరారు. ఎల్లవరం, గుర్తేడు, నందపూర్ దళాల్లో పనిచేశారు. ఏవోబీ సాంకేతిక బృందంలో, సీఆర్సీ-3వ కంపెనీలో కమాండర్‌గా, ఆర్కే రక్షణ స్క్వాడ్ కమాండర్‌గా, ఏవోబీ మిలిటరీ ప్లటూన్ కమాండర్‌గాను వివిధ హోదాల్లో పనిచేశారు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి, కోరాపుట్ జిల్లాల్లో జరిగిన అనేక మావోయిస్టు హింసాత్మక ఘటనల్లో కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు తెలిపారు.

దిల్లీ మేయర్ పీఠం ఆప్‌దే

(మొదటిపేజీ తరువాయి)

మేరకు లెఫ్టినెంట్ గవర్నరు నామినేట్ చేసిన సభ్యులను ఓటింగ్‌కు దూరంగా ఉంచారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలో ఆప్ ఘన విజయం సాధించింది. మొత్తం 250 వార్డుల్లో మెజారిటీ మార్క్(126)ను దాటి.. ఏకంగా 134 స్థానాలు కైవసం చేసుకుంది. మెజారిటీ ప్రకారం మేయర్ పదవి ఆప్‌కు దక్కాల్సి ఉంది. అయితే, లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నియమించిన 10 మంది నామినేటెడ్ కౌన్సిలర్లతో ప్రిసైడింగ్ అధికారి ప్రమాణ స్వీకారం చేయించడం వివాదానికి దారితీసింది. దీన్ని ఆప్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ క్రమంలోనే ఆప్, బీజేపీ మధ్య వాగ్వాదం జరిగి ఈ ఎన్నిక ప్రక్రియ మూడుసార్లు వాయిదా పడింది. ఎన్నికను బీజేపీ అడ్డుకుంటోందని ఆరోపిస్తూ ఆప్ మేయర్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. మేయర్ ఎన్నికలో నామినేటెడ్ సభ్యులు ఓటు వేయరాదని తేల్చి చెప్పింది. దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశానికి 24 గంటల్లో నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. దీంతో దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం నిర్వహించేందుకు లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతించారు. తొలి సమావేశంలోనే మేయర్ ఎన్నిక నిర్వహించగా ఆప్ విజయం సాధించడంతో 15 ఏళ్ల తర్వాత తొలిసారి బీజేపీ నుంచి మేయర్ పీఠం చేజారినట్టయింది. మేయర్‌గా ఎన్నికైన షెల్లీ ఒబెరాయ్ కాలేజీ ప్రొఫెసర్. దిల్లీ యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గానూ పనిచేస్తున్నారు. ఆమె వయస్సు 39 ఏళ్లు. ఇండియన్ కామర్స్ అసోసియేషన్‌లో శాశ్వత సభ్యురాలు. హిమాచల్‌ప్రదేశ్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన ఆమె.. ఇగ్నో నుంచి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన దిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో పటేల్ నగర్ (తూర్పు) వార్డు నుంచి తొలిసారి కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఆమెను ఆప్ మేయర్ అభ్యర్థిగా బరిలో దించింది.

పదవీ కాలం పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

రూపొందించే పని పురోగతిలో ఉంది. అందువల్ల 22వ న్యాయ కమిషన్ పదవీ కాలాన్ని ఆగస్టు 31, 2024 వరకు పొడిగించారు' అని కేబినెట్ నిర్ణయాలను ఉటంకిస్తూ ఆ ప్రకటన వివరించింది. 'న్యాయ కమిషన్... పూర్తి-సమయం చైర్‌పర్సన్, నలుగురు పూర్తి-సమయ సభ్యులు (సభ్య-కార్యదర్శితో సహా), సెక్రెటరీ, న్యాయ వ్యవహారాల విభాగం ఎక్స్-అఫీషియో సభ్యునిగా సెక్రటరీ, లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్ ఎక్స్ అఫిషియో సభ్యుడు, ఐదుగురు పార్ట్ టైమ్ సభ్యులు మించకుండా కూర్పును కలిగి ఉంటుంది' అని పేర్కొంది. ఫిబ్రవరి 21, 2020 నాటి ఉత్తర్వు ద్వారా అందించబడిన దాని ప్రకారం, న్యాయ కమిషన్ పొడిగించిన కాల వ్యవధిలో దాని ప్రస్తుత బాధ్యతను నిర్వర్తిస్తూనే ఉంటుందని ఆ ప్రకటన తెలిపింది. ఇతర విషయాలతో పాటు ఇకపై సంబంధితంగా లేని చట్టాలను గుర్తించడం, వాడుకలో లేని, అనవసరమైన చట్టాలను రద్దు చేయడానికి సిఫార్సు చేయడం, ప్రభుత్వం చేపట్టిన అన్ని సమస్యలు, విషయాలు, అధ్యయనాలు, పరిశోధనలపై ఎప్పటికప్పుడు నివేదికలను సిద్ధం చేయడం, సమర్పించడం వంటివి ఉంటాయి. భారత న్యాయ కమిషన్ అనేది చట్టబద్ధత లేదని సంస్థ. ఇది ఎప్పటికప్పుడు కేంద్రంచే ఏర్పాటవుతుంది. కమిషన్ వాస్తవానికి 1955లో ఏర్పాటయింది. ప్రస్తుత 22వ న్యాయ కమిషన్ పదవీ కాలం ఫిబ్రవరి 20వ తేదీతో ముగిసింది.

అలాగే, అంతర్జాతీయ పౌర విమానయాన విషయాలలో దేశం పాత్రను పెంపొందించే లక్ష్యంతో అంతర్జాతీయ పౌర విమానయాన సదస్సులో సవరణలకు సంబంధించిన మూడు ప్రోటోకాల్‌ల ధ్రువీకరణకు ఆమోదం తెలిపింది. ఆర్టికల్ 3 బిస్, ఆర్టికల్ 50 (ఎ), ఆర్టికల్ 56పై అంతర్జాతీయ పౌర విమానయాన సదస్సు (చికాగో కన్వెన్షన్), 1944లో సవరణలకు సంబంధించి ఆమోదం పొందింది. చికాగో సదస్సుకు సంబంధించిన అధికరణలు ఒప్పంద దేశాల అధికారాలు, బాధ్యతలను ఏర్పాటు చేస్తాయి. అంతర్జాతీయ వాయు రవాణాను నియంత్రించే అంతర్జాతీయ ఐసీఏవో (అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ) ప్రమాణాలు, సిఫార్సు చేసిన పద్ధతులు (ఎస్ఏఆర్‌పీలు) స్వీకరణను ప్రోత్సహిస్తాయి. కాగా గత 78 సంవత్సరాలలో చికాగో సదస్సు కొన్ని సవరణలకు గురైంది. భారతదేశం అటువంటి సవరణలను ఎప్పటికప్పుడు ఆమోదిస్తూనే ఉంది. అంతర్జాతీయ పౌర విమానయానానికి సంబంధించిన విషయాల్లో భారతదేశం మరింత కీలకంగా మారడానికి ఈ ఆమోదం మంచి అవకాశాలను అందిస్తుందని మంత్రివర్గం పేర్కొంది.

భారత ప్రభుత్వం, కో-ఆపరేటివ్ రిపబ్లిక్ ఆఫ్ గయానా ప్రభుత్వం మధ్య విమాన సర్వీసు ఒప్పందంపై సంతకం చేయడానికి ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య విమాన సేవలను అందించడానికి కార్యచరణను అందిస్తుంది. భారత్-గయానా మధ్య కొత్త విమాన సర్వీసు ఒప్పందం రెండు వైపుల ప్రయాణికులకు వాణిజ్య అవకాశాలను అందించేటప్పుడు మెరుగైన అనుసంధానానికి అనుకూలమైన వాతావరణాన్ని అందిస్తుందని ఒక ప్రకటన పేర్కొంది. గయానాలో భారతీయుల సంఖ్య గణనీయమైన స్థాయిలో ఉంది. వారు 2012 జనాభా లెక్కల ప్రకారం జనాభాలో 40 శాతం మందితో అతిపెద్ద జాతి సమూహం. కాగా, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు గయానా ఉపాధ్యక్షుడు భరత్ జగ్‌దేవ్ సోమవారం భారత్‌కు వచ్చారు.

కమలం కకావికలం

(మొదటిపేజీ తరువాయి)

తరుణంలో ఈ నాయకులు వైసీపీతో కలిసి సొంత పార్టీని దెబ్బతీసే ప్రయత్నంలో ఉన్నారని వారు ఆరోపిస్తున్నారు. తొలుత కేంద్ర మాజీమంత్రులు కావూరి సాంబశివరావు, జేడీ శీలం, దగ్గుబాటి పురందేశ్వరి, తెలుగుదేశం పార్టీ నుంచి ఎంపీలు సుజనా చౌదరి, సీఎం రమేశ్, గరికపాటి రామ్మోహనరావు, టీజీ వెంకటేశ్ లాంటి పెద్దనేతలే బీజేపీలో చేరారు. ఆ తర్వాత రాష్ట్రంలో కాపు సామాజికవర్గంలో కీలక నేతగా ఉన్న రాష్ట్ర మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ చేరారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో బీజేపీ పొత్తు పెట్టుకుంది. ఇవేమీ పార్టీ పుంజుకోవడానికి ఏమాత్రం దోహదపడలేదంటే రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా కన్నా రాజీనామా తర్వాత, ఆయన బాటలో మరికొందరు బీజేపీ నేతలు పార్టీని వీడేందుకు సిద్ధపడుతున్న విషయాన్ని ఆపార్టీ అధిష్ఠానం గుర్తించినట్లు తెలుస్తోంది. ఈనెల 26వ తేదీ ఒకసారి దిల్లీ రావాల్సిందిగా అసమ్మతివాదులను జాతీయ నేత ఒకరు ఆహ్వానించినట్లు సమాచారం. ఏపీలో ఉన్న ఇబ్బందులు, పార్టీ పటిష్ఠతకు తీసుకోవల్సిన చర్యల గురించి అధ్యక్షులు జేపీ నడ్డా సమక్షంలో మాట్లాడుకుందామని, తొందరపడొద్దని వారికి సూచించినట్లు తెల్సింది. ఈ అసమ్మతివాదులంతా సోము వీర్రాజుకు వ్యతిరేకంగా నివేదికను సిద్ధం చేస్తున్నట్లు చెపుతున్నారు. కన్నా వెళ్లిపోవడానికి కారణాలతో పాటు, ఆయన హయాంలో నియమితులైన ఆరుగురు జిల్లా అధ్యక్షులను తొలగించిన తీరును ఈ నివేదికలో ప్రస్తావించబోతున్నారు. అలాగే వైసీపీతో అంటకాగుతూ వీర్రాజుపై వస్తున్న అవినీతి ఆరోపణలను అసమ్మతివాదులు అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లబోతున్నట్లు తెల్సింది.

ఏడాదికి రెండుసార్లు 'లా నేస్తం'

(మొదటిపేజీ తరువాయి)

స్థిరపడ్డానికి 'లా నేస్తం' సహకరిస్తుందని అన్నారు. మూడున్నరేళ్లలో 4,248 మంది లబ్ధిపొందారని, ఇప్పటివరకు రూ.35.40 కోట్లు ఖర్చు పెట్టామని చెప్పారు. న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో లాయర్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేశామని జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. కోవిడ్ సమయంలో ఈ నిధుల నుంచి రూ.25 కోట్ల మేరకు సహాయ కార్యక్రమాలు చేపట్టగలిగామన్నారు. ఇందులో అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో లా, ఫైనాన్స్ కార్యదర్శులు సభ్యులుగా ఉంటూ అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్టీని నిర్వహిస్తున్నారని, న్యాయశాఖ కార్యదర్శికి నేరుగా లేక ఈ-మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లా నేస్తం పథకానికి పారదర్శకంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని, ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేసి శాచురేషన్ విధానంలో అర్హుల్లో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చే ఉద్దేశంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి సంవత్సరానికి రెండు దఫాలుగా ఈ పథకం అమలు కానున్నట్లు చెప్పారు. 'మంచి జరగాలనే తపన, తాపత్రయంతో పాదయాత్రలో మాట ఇచ్చాం. దాన్ని నిలబెట్టుకుంటూ అడుగులు ముందుకు వేస్తున్నాం' అని సీఎం అన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేవారంతా అంకిత భావంతో పేదోడి కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయశాఖ కార్యదర్శి జి.సత్య ప్రభాకరరావు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రగిరి విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మళ్లీ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనం చెప్పిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు తాజా సర్క్యులర్, రాజ్యాంగ ధర్మాసనం కేసు విచారణ నేపథ్యంలో రాష్ట్ర విభజన కేసుపై తేదీ నిర్ణయించాలని ఉండవల్లి తరపు న్యాయవాది అల్లంకి రమేశ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్ర విభజన సహేతుకంగా జరగలేదని, దీనివల్ల రెండు రాష్ట్రాల మధ్య అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర విభజన జరగాలంటే కొన్ని ప్రత్యేక పరిస్థితులు, నియమ నిబంధనలు అవసరమని, ఆ మేరకు కేంద్రానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. న్యాయవాది అల్లంకి రమేశ్ విజ్ఞప్తితో ఏప్రిల్ 11న విచారిస్తామని జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ నాగరత్న, జస్టిస్ పార్దీవాల ధర్మాసనం ప్రకటించింది.

చట్టసభలో ప్రజాసమస్యలపై మాట్లాడేవారే లేరు?

- సామాన్యులు ఎన్నికయితేనే ప్రజాస్వామ్యానికి మనుగడ
- అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్సీలైతే పెద్దల సభ గందరగోళమే
- మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్
- అట్టహాసంగా పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్లు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ : అటు పార్లమెంటు, ఇటు శాసనసభలో మతోన్మాదులు, కార్పొరేట్‌లు 90 శాతం మంది ఉన్నారని, ప్రజా సమస్యలపై మాట్లాడే నాయకుడే కరువయ్యాడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం బుధవారం జిల్లా కేంద్రంలో అట్టహాసంగా సాగింది. తొలుత గుత్తి రోడ్డు చలమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఎస్టీయూ, యూటీఎఫ్, ఇతర ప్రజా సంఘాల అధ్వర్యంలో అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జల్లి విల్సన్‌తో పాటు ఎమ్మెల్సీలు వెంకటేశ్వర రావు, షాజ్జో, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ పట్టభద్రుల ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోగమూర్తి, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకుడు జాఫర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు వేమయ్య యాదవ్, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు రాంభూపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల, నిరుద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కారం కావాలంటే ప్రజాసేవ పట్ల అంకిత భావం, క్రమశిక్షణ కలిగిన నాయకత్వం అవసరమన్నారు. పార్లమెంటు, శాసనసభ, శాసన మండలిలో మతోన్మాదులు, కోటీశ్వరులు, బడా పారిశ్రామిక వేత్తలు ప్రజాప్రతినిధులుగా కూర్చొని ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి స్వార్థపరులకు దేశ పురోగతి, ప్రజాసమస్యలు ఏమాత్రం పట్టవని విమర్శించారు. శాసన మండలిలో ప్రజావాణిని వినిపించేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక బృహత్తర అవకాశమని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, నిరుద్యోగులు, ఆయా రంగాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి, ప్రాంతాల మధ్య అభివృద్ధిని కాంక్షించే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీగా కత్తి నరసింహారెడ్డి గత ఆరేళ్లుగా నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. సామాజిక న్యాయం పేరుతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ అణగారిన, బడుగు బలహీనవర్గాలకు అన్యాయం చేసి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అగ్రవర్ణాలకే అగ్రతాంబూలం ఇస్తోందని విరుచుకుపడ్డారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు, నిరుద్యోగులు మేధావులు, పోరాట యోధులను గుర్తించి ఎమ్మెల్సీలుగా ఎన్నుకోవాలని సూచించారు. ఇప్పటికే అనేక సమస్యలు ప్రజలను పీడిస్తున్నాయని, కేంద్రం నూతన విద్య విధానాన్ని తీసుకురావడం వల్ల కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. విద్యారంగంపై ఏమాత్రం పరిజ్ఞానం లేని కమిషనర్లు, ముఖ్యకార్యదర్శులు ఉండటంతోనే సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయని తూర్పారబట్టారు. అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్సీలైతే మండలిలో ప్రజా సమస్యలను వాయిదా వేస్తూ చర్చలు లేకుండా విలువైన సమయాన్ని వృథా చేస్తారని విమర్శించారు. గతంలో తనతోపాటు ఎమ్మెల్సీగా గేయానంద్, పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మండలిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, రైతులు, కూలీలు, చేతివృత్తిదారుల సమస్యలు, సాగునీటి ప్రాజెక్టులపై స్పష్టమైన వైఖరితో అన్ని వర్గాల ప్రజల వాణిని వినిపిస్తూ పోరాడామని జల్లి విల్సన్ గుర్తు చేశారు. ఆ క్రమంలోనే పీడీఎఫ్ అభ్యర్థులను శాసన మండలికి పంపించి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, కూలీల సమస్యలపై ఉద్యమ గళం వినిపించాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే దుర్మార్గాలు, అన్యాయాలను వ్యతిరేకించాలని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కోరారు. వీరి గెలుపు కోసం ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి నామినేషన్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామాంజినేయులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, రాష్ట్ర మాజీ నాయకుడు నారాయణ స్వామి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, కర్నూలు జిల్లా నాయకుడు గిడ్డయ్య, నంద్యాల జిల్లా నాయకుడు రంగా నాయుడు, కడప జిల్లా నాయకుడు నాగ సుబ్బారెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు శ్రీరాములు, రమణ, రాజేష్ గౌడ్, మల్లికార్జున, కుల్లాయ్ స్వామి, చిరంజీవి, సంతోష్ కుమార్, ఆనంద్ కుమార్, ఆరు జిల్లాల ఎస్టీయూ, యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెంత కాలం ఆపుతారు

- అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలి
- ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం: అగ్రిగోల్డ్ బాధితులను తక్షణమే ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తానని పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి నాలుగేళ్లవుతున్నా ఆ హామీని పూర్తిగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు అధ్వర్యంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవి నాయుడు అధ్యక్షతన స్థానిక రైతుబజార్ సమీపంలో ఉన్న ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయిస్ సంఘం భవనంలో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ముప్పాళ్ల నాగేశ్వరరావుతో పాటు అసోసియేషన్ ఉత్తరాంధ్ర గౌరవాధ్యక్షులు పి.కామేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య హాజరయ్యారు. ముప్పాళ్ల మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు ఇంకా రూ.3వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని, ఇప్పటికి కేవలం రూ.906 కోట్లు మాత్రమే చెల్లించారని చెప్పారు. మన పోరాట ఫలితంగా సుమారు 10 లక్షల మందికి 10, 20 వేల రూపాయలలోపు డబ్బులు చెల్లించారన్నారు. ఇంకా రూ.20 వేల లోపు 3.5 లక్షల మందికి, రూ.20 వేల పైన 6.5 లక్షల మందికి చెల్లించాల్సి ఉందని గుర్తుచేశారు. విజయవాడ హనుమంతరావు గ్రంథాలయంలో నిర్వహించిన నిరాహార దీక్ష శిబిరానికి వచ్చిన జగన్...భరోసా కల్పించి దీక్షను విరమింప చేశారని తెలిపారు. పోరాటాల ఫలితంగా 40 మాసాల తర్వాత 2021 ఆగస్టు 24న బాధితులకు రూ.906 కోట్లు చెల్లించారన్నారు. అప్పటికి అది గొప్ప విజయమని ముప్పాళ్ల చెప్పారు.10 లక్షలమందికి డబ్బులు అందాయని, చరిత్రలో ఇలాంటి విజయం ఎవరూ సాధించలేదన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల పోరాటం వల్ల కంపెనీ ఆస్తులు ప్రభుత్వం చేతికి వచ్చాయని, ప్రభుత్వ సొమ్ము మనకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, కంపెనీ ఆస్తుల ద్వారా అందిస్తే సరిపోతుందని ముప్పాళ్ల చెప్పారు. సీఎం జగన్ తలచుకుంటే ఒక్క కలంపోటుతో డిపాజిట్లు ఇప్పించవచ్చన్నారు. సీఎంకు కంపెనీ యజమానులపై ఉన్న ప్రేమ బాధితులపై లేదని ఆరోపించారు. న్యాయం జరిగేంత వరకూ ఐక్యంగా పోరాడదామని బాధితులకు ముప్పాళ్ల పిలుపునిచ్చారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ అడగకుండానే లక్షల కోట్లు ప్రజలకు ఉచితంగా పంచుతున్న సీఎం జగన్...కష్టపడి డిపాజిట్ చేసుకున్న డబ్బును ఎందుకు ఇప్పించడం లేదని ప్రశ్నించారు. కంపెనీ మాటలు నమ్మి వేలకోట్లు కొల్లగొడదామనుకుంటే చూస్తూ ఊరుకోబోమని, పోరాడి సాధిస్తామని స్పష్టంచేశారు. తక్షణమే సమస్యను పరిష్కరించకపోతే త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల సమయంలో చట్టసభను ముట్టడిస్తామని హెచ్చరించారు. కామేశ్వరరావు మాట్లాడుతూ అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ అగ్రిగోల్డ్ బాధితులు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. చివరి పైసా చెల్లింపులు అయ్యేవరకు అగ్రిగోల్డ్ బాధితులకు సీపీఐ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.మురళి, డాక్టర్ వెల్లంకి గోవింద, సాయిరాం, వెల్లంకి శ్రీను, అధిక సంఖ్యలో బాధితులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్రగతిపై సీఎస్‌లతో మోదీ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రగతి కార్యక్రమం కింద అమలు చేస్తున్న ప్రాజెక్టులతో పాటు అమృత్ సరోవర్ అమలు తీరును ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం దిల్లీ నుంచి వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. వివిధ జాతీయ రహదారుల అభివృద్ధి, నూతన రైల్వేలైన్ల నిర్మాణం, గ్యాస్ పైపులైన్లు, థర్మల్‌పవర్ ప్రాజెక్టుల పనుల ప్రగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల నుంచి వివరాలు తీసుకున్నారు. అమృత్ సరోవర్ పథకం అమలు తీరునూ సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె.ప్రవీణ్ కుమార్, బి.రాజశేఖర్, ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్ కుమార్, శ్యామల రావు, పీఆర్-ఆర్డీ కమిషనర్ కె.శశిధర్, ఈఎఫ్‌ఎస్టీ ప్రత్యేక కార్యదర్శి చలపతిరావు పాల్గొన్నారు.

గవర్నర్ దంపతులకు సీఎం ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చత్తీస్‌గఢ్‌కు బదిలీ కావడంతో ఆయనకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బుధవారం గన్నవరం విమానాశ్రయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. గవర్నర్ దంపతులను స్వయంగా కలిసి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ కె.మోషేన్‌రాజు, గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్, ఏపీ అగ్రీ మిషన్ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతోనే సామాజికాభివృద్ధి: కాకి సునీత

విశాలాంధ్ర-విజయవాడ: సామాజిక పరివర్తన, అభివృద్ధి మహిళలపై ఆధారపడి ఉందని, మహిళా సాధికారతతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని చేనేత జౌళిశాఖ ప్రధాన కార్యదర్శి కాకి సునీత అన్నారు. దళిత స్త్రీశక్తి (డీఎస్‌ఎస్) 17వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో డీఎస్‌ఎస్ జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సదస్సులో 'దళిత స్త్రీల సాధికారతే-సామాజిక ప్రగతి'అంశంపై సునీత మాట్లాడుతూ దళిత, ఆదివాసీలపై హింసను రూపుమాపటానికి ప్రత్యేక చట్టం ఉన్నా అమలు తీరు ఆశించినంతగా లేదన్నారు. మహిళా చట్టాలు అమలు కోసం ఒక వెబ్‌సైట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళలు హక్కులు సాధించుకునే విధంగా తయారు కావాలని సూచించారు. దళితస్త్రీ శక్తి 17వ వార్షిక నివేదికను ఆమె ఆవిష్కరించారు. సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రవీణ్ కుమార్, మాత-శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బౌరా కోటేశ్వరరావు వక్తల్లో ఉన్నారు. గెడ్డం ఝాన్సీ మాట్లాడుతూ 15 వందలకిపైగా హింసాత్మక సంఘటనలకు సంబంధించి నిజనిర్ధారణ నుంచి బాధితుల పక్షాన నిలబడి గెలుపు కోసం పని చేస్తున్నామని చెప్పారు. సదస్సు అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. తొలుత గౌతమ బుద్ధ, అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్, ఎస్ఆర్.శంకరన్ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత జడ్జి డేవిడ్ రత్నాకర్, ఆయుర్వేద కళాశాల వైస్ ప్రిన్సిపల్ విజయ కుమారి, ఎస్‌సీపీసీఆర్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్, దళిత స్త్రీశక్తి రాష్ట్ర- కేంద్ర సమన్వయకర్తలు భాగ్యలక్ష్మీ, సత్య, సుసన్న, శ్రీదేవి, వలంటీర్లు పండు, లక్ష్మీ ప్రసన్న, రోజా, దుర్గా భవాని పాల్గొన్నారు. చైల్డ్‌లైన్ జిల్లా సమన్వయకర్త అరవ రమేశ్ బృందం అభ్యుదయ గీతాలు ఆలపించారు.

జోగినాయుడు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి అధిపతిగా సినీనటుడు, దర్శకుడు, వ్యాఖ్యాత ఎల్.జోగినాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వెలగపూడిలో ఆంధ్రప్రదేశ్ సచివాలయం నాల్గవ బ్లాక్‌లోని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ చాంబరులో ప్రమాణ స్వీకారం చేసి తదుపరి పదవీ బాధ్యతలను చేపట్టారు. సాంస్కృతిక పురోగతి, తెలుగు భాషాభివృద్ధి, పద్య, ఆధునిక నాటక వికాసం, జానపద కళారూపాల అభివృద్ధి, ఆధునీకీకరణ తదతర కార్యక్రమాలను వ్యూహాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి అధిపతిగా ఎల్.జోగినాయుడును నియమిస్తూ ఏపీ ప్రభుత్వం ఈనెల 17న ఉత్తర్వులు జారీ జేసింది. ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పట్టాభి

విశాలాంధ్ర-విజయవాడ: తెలుగుదేశం నేత కొమ్మారెడ్డి పట్టాభిరాంను పోలీసులు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి బుధవారం తరలించారు. గత రాత్రి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు చేయించిన పోలీసులు తమ కస్టడీలోనే ఉంచుకున్నారు. తనపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని మంగళవారం న్యాయమూర్తికి పట్టాభి వివరించటంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించాలని న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా వైద్య పరీక్షలు పూర్తయ్యేసరికి కోర్టు సమయం ముగియటంతో బుధవారం ఉదయం తిరిగి గన్నవరం అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో పట్టాభిని హాజరుపరిచారు. వైద్య నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి ఆయనను గన్నవరం సబ్ జైలుకు పంపాలని ఆదేశించారు. అయితే శాంతి భద్రతల దృష్ట్యా వేరే జైలుకు తరలించాలని పోలీసులు న్యాయమూర్తిని కోరగా ఆ అభ్యర్ధనను న్యాయస్థానం తిరస్కరించింది. ముందస్తు అనుమతి కోరితే పరిశీలిస్తామని న్యాయమూర్తి తెలిపారు. గన్నవరం సబ్ జైలులో ఖాళీ లేని పరిస్థితులు, సౌకర్యాలు తగినంత లేకపోవటం, ఇతర ఇబ్బందుల దృష్ట్యా తెలుగుదేశం నేతలను వేరే జైలుకు తరలించాలనే మరో అభ్యర్ధనను పోలీసులు న్యాయస్థానం ముందు పెట్టారు. పోలీసుల తాజా అభ్యర్ధనపై న్యాయమూర్తి విచారించి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశించారు. దీంతో పోలీసులు బుధవారం రాత్రి పట్టాభిరాంను రాజమండ్రి సెంట్రల్ జైలు తరలించారు.

జగన్‌కు ప్రత్యేక చట్టాలున్నాయా?

ఎన్నికల కోడ్‌పై చంద్రమోహన్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఎన్నికల కోడ్ అమలు విషయంలో జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయా? అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. వైఎస్సార్ లా నేస్తం పథకం కింద 2,011 మంది న్యాయవాదుల ఖాతాల్లో రూ.కోటి జమ చేయడం, పత్రికా ప్రకటనలకు రూ.కోటి ఖర్చు చేయడాన్ని ప్రస్తావించారు. 'రాష్ట్ర ప్రజలకు ఇదేం ఖర్మ. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పేరుతో ఓ వైపు మహానుభావుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఇక్కడేమో పత్రికలకు సీఎం ఫొటో పెట్టుకుని కోట్లు ఖర్చుపెట్టి ప్రకటనలు ఇస్తున్నారు. ఇది ఎన్నికల నియామావళి ఉల్లంఘన కాదా? జగన్ రెడ్డికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయా? ఎన్నికల సంఘం అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రకటనలు, బటన్ నొక్కుడుపై చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయడం ద్వారా రాష్ట్రానికి ఓ సందేశం ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీలుగా టీడీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా అరాచక వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు.

సీఎంతో కొత్త వీసీల భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివిధ విశ్వవిద్యాలయాల కొత్త వీసీలు బుధవారం తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రితో కడప డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ బానోత్ ఆంజనేయ ప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ (జేఎన్‌టీయూ) గురజాడ, విజయనగరం వీసీ వెంకట సుబ్బయ్య, ఆంధ్రా కేసరి విశ్వవిద్యాలయ ఒంగోలు వీసీ మారెడ్డి అంజిరెడ్డి కలిశారు.

రక్తహీనత నివారణకు బీ12 ఔషధాల పంపిణీ

సమీక్షలో మంత్రి విడదల రజని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రజల్లో రక్తహీనత నిర్మూలనకు నడుం బిగించినట్లు ఏపీ వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తీసుకున్న చర్యల్లో భాగంగా బీ12 మందలను బాధితులకు పంపిణీ చేయడాన్ని ప్రయోగాత్మకంగా చేపడుతున్నట్లు చెప్పారు. బాలికలు, గర్భిణులు, బాలింతలకు బీ-12 ఔషధాలను మూడు నెలల కోర్సుగా అందించగలిగితే వారిలో రక్తహీనతను నివారించవచ్చని చెప్పారు. మంత్రి బుధవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ)పై సమీక్షించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఏపీ దేశంలోనే ముందుండాలని, అన్ని అంశాల్లోనూ తొలిస్థానంలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. మాత-శిశు మరణాల నివారణలో రాష్ట్రం ముందంజలో ఉందని, సుస్థిరాభివృద్ధి సూచీల్లో ఇది ఎంతో కీలకమని తెలిపారు. 99.66 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతుండటం శుభ పరిణామమని చెప్పారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం లేకుండా ఇప్పటికే ప్రభుత్వం ఎన్నో పథకాల ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఈ ఫలాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలను వినియోగించుకునే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. క్షయ పరీక్షల కోసం వచ్చే ప్రతి ఒక్కరికి వెంటనే పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది అయిన అంగన్‌వాడీలు, ఆయాలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎం సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కుటుంబ సంక్షేమ కమిషనర్ జే.నివాస్, సంచాలకులు రామిరెడ్డి పాల్గొన్నారు.

మోటార్లకు మీటర్లు పెడితే పగలగొట్టండి

రైతులకు లోకేశ్ పిలుపు

విశాలాంధ్ర-ఏర్పేడు: వ్యవసాయ మోటార్లకు ప్రభుత్వం మీటర్లు బిగిస్తే వాటిని పగులగొట్టాలని 'యువగళం' పాదయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రైతులకు పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వ విధానాలతో రాష్ట్ర రైతులపై అప్పులభారం పెరుగుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చక్కెర పరిశ్రమలకు పూర్వవైభవాన్ని కల్పిస్తామని హామీనిచ్చారు. పాదయాత్ర 24వ రోజు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో సాగింది. రైతులతో ముఖాముఖి భేటీ అయిన లోకేశ్ వారి సమస్యలను తెలుసుకున్నారు. జగన్ విధానాలను ప్రతి రైతూ వ్యతిరేకించాలని, వారికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జగన్ పాలనలో వ్యవసాయానికి హాలిడే ప్రకటించే పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల ఆత్మహత్యలలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్నారు. రైతులపై తలసరి అప్పు భారం నానాటికీ పెరిగిపోతోందని లోకేశ్ అన్నారు. పథకాల పేరిట ప్రజలకు రూ.10 ఇచ్చి రూ.100ను జగన్ ప్రభుత్వం స్వాహా చేస్తోందని విమర్శించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరు చక్కెర పరిశ్రమలకు పూర్వ వైభవం తెస్తామన్న జగన్ ఐదింటిని మూయించారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చెరకు రైతులకు రూ.63కోట్లు బకాయి ఉన్నట్లు తెలిపారు. చక్కెర పరిశ్రమలను శాశ్వతంగా మూతవేసి ఆ భూములను అమ్మేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల లోగా ఇది జరగవచ్చన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చక్కెర పరిశ్రమలకు పూర్వ వైభవం తెస్తామన్నారు. చక్కెర పరిశ్రమల వారు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతో సహా చెల్లిస్తామని, రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గిస్తామని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి వ్యవసాయ రంగాన్ని ఉపాధి హామీతో అనుసంధానం చేయించడానికి కృషి చేస్తామని హామీలిచ్చారు. ఎరువులు, పురుగుల మందులపై జీఎస్టీ తగ్గించడానికి కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. పెట్రో ఉత్పత్తులపై రాష్ట్రపన్నులు తగ్గించి వినియోగదారులకు భారం లేకుండా చేస్తామన్నారు. రైతులకు రాయితీలిచ్చి వ్యవసాయం గిట్టుబాటయ్యేలా చేస్తామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైతుకు శ్రమ తగ్గిస్తామన్నారు. లోకేశ్ వెంట నేతలు అమరనాథరెడ్డి, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ధనుంజయులనాయుడు, మునిక్రిష్ణమనాయుడు, మల్లిఖార్జుననాయుడు, సత్రవాడ ప్రవీణ్, రవీంద్రనాథరెడ్డి, చెంచయ్యనాయుడు, ప్రకాశ్ నాయుడు, శివశంకరరెడ్డి ఉన్నారు.

పీఏసీ చైర్మన్ పయ్యావులకు ఊరట

భద్రత కల్పించాల్సిందేనంటూ హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఉరవకొండ టీడీపీ శాసనసభ్యులు పయ్యావుల కేశవ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. చాలాకాలంగా పయ్యావులకు కొనసాగుతున్న టూ ప్లస్ టూ భద్రతను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. విద్యుత్ కొనుగోళ్లతో పాటు ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలపై పయ్యావుల రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం కేశవ్‌కు భద్రతను ఉపసంహరించిందంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. మరో ఏడాదిలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నియోజక వర్గంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడం, మావోయిస్టుల నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో తనకు భద్రత కల్పించాలని పయ్యావుల కేశవ్... హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గతంలో విచారణ చేపట్టి, కేశవ్‌కు భద్రత కల్పించాల్సిన అంశానికి సంబంధించి కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆ మేరకు బుధవారం నిర్వహించిన విచారణలో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన హైకోర్టు, ఉరవకొండలో పరిస్థితులు ఏంటో మీకు తెలుసు, అటువంటప్పుడు కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించింది. కేశవ్‌కు తక్షణమే వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఐదు లేదా ఆరుగురు సెక్యూరిటీ సిబ్బంది పేర్లు ఇవ్వాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది. అందులో ఇద్దరిని సెక్యూరిటీగా నియమించేందుకు తగిన ఆదేశాలు ఇస్తామని న్యాయస్థానం తెలిపింది. అయితే పిటిషనరే పేర్లు ఇవ్వాలని హైకోర్టు సూచించడం పట్ల ప్రభుత్వ న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందు భద్రత కల్పించిన వ్యక్తులపై పిటిషనర్‌కు నమ్మకం ఉండాలి కదా అంటూ హైకోర్టు ప్రశ్నించింది. టూ ప్లస్ టూ భద్రతపై విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని హైకోర్టు స్పష్టం చేసింది.

చకాచకా అంబేద్కర్ విగ్రహ నిర్మాణం

పనులు పరిశీలించిన మంత్రి మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో ఎక్కడా లేనట్లు విజయవాడ నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు చకాచకా జరుగుతున్నట్లు మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఈ విగ్రహం నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని అన్నారు. ఆయన బుధవారం అధికారులు, నాయకులతో కలిసి విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించారు. పాదాలకు బూట్లు, వాటిపై ప్యాంట్ విడి భాగాల వెల్డింగ్ జరుగుతోందన్నారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను సీఎం జగన్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. సాంకేతిక నిపుణులు వాసుదేవరావు మాట్లాడుతూ 80 అడుగుల పెడస్టల్ బేస్‌మెంట్ నిర్మాణంపై 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భూమి నుంచి విగ్రహం ఎత్తు మొత్తం 205 అడుగులన్నారు. విగ్రహం చుట్టూ స్మృతివనంతో పాటు సెంట్రల్ లైబ్రరరీ, కన్వెన్షన్ సెంటర్, ఎమ్యూజ్‌మెంట్ పార్క్, రెండు వేల మంది సామర్థ్యం కలిగిన కమ్యూనిటీ హాల్‌ను మొత్తం 18 ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.248 కోట్లతో నిర్మిస్తున్నట్లు మంత్రి నాగార్జున తెలిపారు. ఆయన వెంట ప్రభుత్వ అధికారులు, సాంకేతిక నిపుణులు, అంబేద్కర్ సమాజ సభ్యులు, అంబేద్కర్ వాదులు, అభిమానులు, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ నాయకులు కనకాల రావు, బత్తుల వీరాస్వామి, జొన్నలగడ్డ శ్రీకాంత్, పి.ప్రకాశ్, కోన స్వర్ణ, స్వప్న, తాటికొండ నరసింహారావు, బి.స్టాలిన్, ముత్తయ్య, విజయభాస్కర్ ఉన్నారు.

జగనన్న కాలనీల్లో ఏపీ ఫైబర్‌నెట్

- ధరల పెంపు ప్రచారం అవాస్తవం
- ఏపీ ఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్లల్లో ఏపీ ఫైబర్ నెట్ సేవలు అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఏపీ ఎస్‌ఎఫ్‌ఎల్) చైర్మన్ డాక్టర్ పి.గౌతమ్‌రెడ్డి తెలిపారు. ఏపీ ఫైబర్‌నెట్ బేసిక్ ప్లాన్ ధరలు పెంచినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని వెల్లడించారు. బుధవారం విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్దగల ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, మూడో అంతస్తులోని ఫైబర్ నెట్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వానికి బేసిక్ ప్లాన్ ధరలు పెంచే ఆలోచన లేదన్నారు. ప్రస్తుతం ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా రూ.190కే ఇంటర్నెట్ సేవలందిస్తున్నామని గౌతమ్ రెడ్డి చెప్పారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో ఏపీ ఫైబర్‌నెట్ బాక్సుల సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. జగనన్న కాలనీలు, టిడ్కో గృహాల్లో ఏపీ ఫైబర్‌నెట్‌ను తొలగించి బయటి నెట్‌వర్క్‌లను వినియోగిస్తే ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ఆధ్వర్యంలో చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల జగనన్న కాలనీలు, టిడ్కో గృహాల్లో ఏపీ ఫైబర్ నెట్ వినియోగం జరిగేలా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఏపీ ఫైబర్ నెట్ 15లక్షల కనెక్షన్ల నెట్‌వర్క్ అని, ప్రస్తుతం ఆరు లక్షల కనెక్షన్లుకు పైగా ఉన్నట్లు చెప్పారు. 55 వేల కిలోమీటర్ల వరకు ఏపీ ఫైబర్ నెట్ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 33 వేల కిలోమీటర్లలో పనులు జరుగుతున్నాయని, 27 వేల కిలోమీటర్లలో ఏపీ ఫైబర్ నెట్ ట్రెండింగ్‌లో ఉందన్నారు. ఏపీ ఫైబర్ నెట్ బాక్సుల సర్వీస్‌కు, కొత్త బాక్సుల ఆర్డర్లకు ఇకపై టెండర్ల విధానం అవలంభించాలని, రాష్ట్రంలో సొంతంగా ఫైబర్ నెట్ బాక్సుల తయారు చేయాలని నిర్ణయించామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ కేర్ సెంటర్లు, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ తదితర ప్రభుత్వ విభాగాల్లో ఏపీ ఎస్‌ఎఫ్‌ఎల్ ద్వారా ప్రాజెక్టులు చేపట్టి కనెక్షన్లు ఇచ్చామన్నారు. బీబీఎన్‌ఎల్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రానికి రూ.500కోట్లు వచ్చాయని, ఇంకా రూ.500 కోట్లు రావాల్సి ఉందన్నారు. కొత్తగా 50 లక్షల బాక్సులు అవసరమని, 20 లక్షల బాక్సులకు టెండర్లు కోరనున్నట్టు చెప్పారు.

సంపాదకీయం

చెప్పుకోదగ్గ విజయమే!

కనీవినీ ఎరుగనిరీతిలో అత్యంత రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్న ఢిల్లీ మేయర్ ఎన్నికకు ఎట్టకేలకు హర్షాతిరేకాలు, చప్పట్ల నడుమ ప్రశాంతంగా తెరపడింది. ప్రజాస్వామ్య హితైషుల ఆకాంక్షలకు ఈ ఎన్నిక నిలువుటద్దంగా నిలిచింది. ఢిల్లీ మేయర్‌గా షెల్లీ ఒబెరాయ్ ఎన్నికయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలో హోరాహోరీగా సాగిన పోరులో ఆమె విజయం సాధించారు. ఇది ఒక్క ఆప్ విజయం మాత్రమే కాదు.. లౌకిక, ప్రజాస్వామికవాదుల గెలుపు. ఎన్నో మలుపులు తిరిగిన ఎన్నికల ప్రక్రియ చివరకు పరిణతిచెందిన ఢిల్లీ ప్రజల ఆలోచనకు, సానుకూల తీర్పుకు సరైన ముగింపునిచ్చింది. బీజేపీ అభ్యర్థి రేఖా గుప్తాపై 34 ఓట్ల తేడాతో ఆప్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ గెలవడంతో రెండు అతిపెద్ద ప్రమాదాలకు అడ్డుకట్ట వేసినట్లయింది. మొదటిది, గవర్నర్ల రాజ్యాంగ అతిక్రమణ పోకడలకు ఈ విజయం సవాల్‌ను విసిరింది. ఇక రెండవది, మోదీ ప్రభుత్వ అధికార దాహానికి తాత్కాలికంగానైనా అడ్డంకొట్టడం మనసుకు హాయిగా అనిపించింది.

మొత్తం 266 ఓట్లు పోల్ కాగా.. షెల్లీ ఒబెరాయ్‌కు 150 ఓట్లు, రేఖా గుప్తాకు 116 ఓట్లు దక్కాయి. దీంతో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆప్ శ్రేణుల సంబరాలు అంబరాన్ని తాకుతాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల చరిత్రలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య నిర్వహించిన ఈ ఎన్నికల్లో కొత్త మేయర్‌ను అభినందిస్తూ.. 'ప్రజలు గెలిచార'ని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ చేసిన ట్వీట్ మోదీషా ద్వయానికి చిరాకుపుట్టించేదే.

పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బీజేపీయేతర మేయర్ బాధ్యతలు చేపట్టడం శుభసూచకం. ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికలు జరిగినప్పటి నుంచే వివాదం నడుస్తూనే వుంది. మేయర్ ఎన్నిక మూడుసార్లు వాయిదా పడింది. నిజానికి ఇది కొత్త కార్పొరేషన్. దశాబ్దకాలం క్రితం ఢిల్లీలో మూడు మున్సిపల్ కార్పొరేషన్లు వుండేవి. కేంద్రీకృత రాజకీయాలకు అలవాటుపడిన మోదీషా ఈ మూడు కార్పొరేషన్లను విలీనం చేసి, ఒకటిగా మార్చారు. ఈ మున్సిపోల్స్‌లో గెలవడం ద్వారా కేజ్రీవాల్‌కు పాన్ తినిపించాలని అమితంగా ఆశించారు. కానీ, గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలో అనూహ్యంగా ఆప్ ఘన విజయం సాధించింది. మొత్తం 250 వార్డుల్లో మెజార్టీ మార్క్(126)ను దాటి.. ఏకంగా 134 స్థానాలను కైవసం చేసుకుంది. మెజారిటీ ప్రకారం, రాజ్యాంగ సూత్రాల ప్రకారం, మేయర్ పదవి ఆప్‌కే దక్కాలి. కాకపోతే అడ్డదారులు తొక్కి, అధికారాన్ని చేజిక్కించుకోవడానికి అలవాటుపడిన మోదీషా అసాధ్యమైన ప్రక్రియను అనైతికంగా సుసాధ్యం చేయాలని తలంచింది. ఆ క్రమంలోనే నామినేటెడ్ పోస్టులద్వారా తమకు తాము రాసుకున్న అక్రమ సంఖ్యాశాస్త్రాన్ని అమలు చేయడానికి పూనుకున్నది. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నియమించిన 10 మంది నామినేటెడ్ కౌన్సిలర్లతో ప్రిసైడింగ్ అధికారి ప్రమాణస్వీకారం చేయించడం వివాదానికి దారితీసింది. పైగా సభాధ్యక్ష పదవికి సీనియారిటీని పక్కనబెట్టి, తమ అనుయాయుడ్ని పెట్టుకున్నారు. సహజంగానే దీన్ని ఆప్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆప్, బీజేపీ మధ్య వాగ్వాదం తలెత్తడం, ఎన్నిక ప్రక్రియ మూడుసార్లు వాయిదా పడిన ఉదంతం సర్వవిధితమే. ఈ తరుణంలో మేయర్ ఎన్నికను బీజేపీ అడ్డుకుంటోందని ఆరోపిస్తూ ఆప్ మేయర్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కీలక తీర్పు వెలువరించి, ప్రజాస్వామ్య విలువలను మరోసారి పరిరక్షించింది. మేయర్ ఎన్నికలో నామినేటెడ్ సభ్యులు ఓటువేయరాదని తేల్చి చెప్పింది. అంతేగాక, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) సమావేశానికి 24 గంటల్లో నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం బుధవారం నిర్వహించేందుకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతించడంతో తొలి సమావేశంలోనే మేయర్ ఎన్నిక నిర్వహించగా ఆప్ విజయం సాధించడంతో 15 ఏళ్ల తర్వాత తొలిసారి బీజేపీ నుంచి మేయర్ పీఠం చేజారినట్లయింది.

సుప్రీం తీర్పు వచ్చిన తర్వాత కూడా మోదీషా తమ కుయుక్తులు ఆపలేదు. ఆప్ కార్పొరేటర్లకు తాయిలాలు చూపించడం లాంటి చిలక్కొట్టుడు వ్యవహారాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. పైగా ఢిల్లీ నుంచి ఎన్నికైన ఏడుగురు లోక్‌సభ సభ్యులు, ముగ్గురు రాజ్యసభ సభ్యులు, ఒక శాసనసభ సభ్యుడికి ఈ ఎన్నికలో ఓటేసే అధికారం వుంది. ఆ ప్రయత్నమూ బెడిసికొట్టింది. ఢిల్లీ శాసనసభ స్పీకర్‌కు ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 13 మందిని నామినేట్‌చేసే అవకాశం వున్నప్పటికీ, అది అనైతికమని భావించిన ఆప్ ఆ పనిచేయలేదు. ముప్పేట దాడులతో ఆమ్ ఆద్మీ పార్టీని ఇరుకున పెట్టాలని చూసిన బీజేపీ సంకుచిత బుద్ధికి తాజా ఫలితం ఒక గుణపాఠం. అందుకే దీనిని చెప్పుకోదగ్గ విజయంగానే పరిగణించవచ్చు.

మేయర్ షెల్లీ ఒబెరాయ్ ఆప్‌లో క్రియాశీల యువ మహిళానేతగా వున్నారు. ఆమె వయస్సు 39 ఏళ్లు. ఢిల్లీ యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇండియన్ కామర్స్ అసోసియేషన్‌లో శాశ్వత సభ్యురాలు కూడా. హిమాచల్‌ప్రదేశ్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన ఆమె.. ఇగ్నో నుంచి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో పటేల్ నగర్ (తూర్పు) వార్డు నుంచి బరిలో దిగి తొలిసారి కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఆమెను ఆప్ మేయర్ అభ్యర్థిగా బరిలో దించారు. ఆప్‌లో యువనేతలకు కొదవలేదు. తాజా విజయంతో మరో యువ మహిళ అత్యంత కీలకమైన స్థానాన్ని కైవసం చేసుకోగలిగారు.

ఢిల్లీ మేయర్ ఎన్నిక ఫలితం మోదీ సర్కారుకు చెంపపెట్టు లాంటిది. దేశ వ్యాప్తంగా మోదీ అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో ఈ విజయం లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు బలాన్నిచ్చింది. బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి దీటుగా ప్రత్యామ్నాయ శక్తి అవతరించడానికి గల అవకాశాలకు ఊతమిచ్చినట్లయింది. ప్రజాస్వామికవాదులు ఆశిస్తున్నట్లుగా భవిష్యత్ రాజకీయ సానుకూల పరిణామాలకు ఇదొక మేలిమలుపు కాగలదని ఆశిద్దాం!

ఆదర్శ తమిళ కవయిత్రి సుకీర్తారాణి

ఆర్థిక నేరస్తుడు గౌతమ్ అదానీ ప్రాయోజితం చేసిన అవార్డును ప్రముఖ తమిళ కవయిత్రి సుకీర్తారాణి తిరస్కరించి ఎందరికో ఆదర్శంగా నిలవడం శుభ పరిణామం. ఈ రకంగా ఆమె అవార్డుని స్వీకరించపోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడమే కాకుండా ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసిం దనడంలో ఏమాత్రం సందేహం లేదు. అవార్డులను ప్రకటించ గానే స్వీకరించాలనుకునే వారు కోకొల్లలు ఉన్న ఈ రోజుల్లో, ఆమె తాను విశ్వసించిన ఆదర్శాల మేరకు ఆ అవార్డుని తిరస్కరించి భావి తరాలకు సరికొత్త సందేశాన్ని అందివ్వడం అభినందనీయం. ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ నిర్వహించే 'దేవి అవార్డ్స్' కోసం దేశ వ్యాప్తంగా సుకీర్తారాణితో పాటుగా శాస్త్రవేత్త గగన్‌దీప్ కాంగ్, భరతనాట్యం నృత్యకారిణి ప్రియదర్శిని గోవింద్, పరోపకారి రాధికా సంతానకృష్ణ, స్క్వాష్ క్రీడాకారిణి జోష్నా చినప్ప తదితరులు మొత్తంగా 12 మంది మహిళా ప్రముఖులను ఎంపిక చేయగా, తమిళ కవయిత్రి సుకీర్తారాణి మాత్రమే అవార్డును తిరస్కరించడం గమనార్హం. ముఖ్యంగా సుకీర్తారాణి దళిత సాహిత్యానికి చేసిన కృషికి ఎంపిక అయ్యారు. 'నేను మొదట ఈ అవార్డును స్వీకరించ దానికి అంగీకరించాను. కాని ముఖ్యంగా ఈ అవార్డు ఈవెంట్‌ను ప్రాయోజితం చేసినది అదానీ అని తెలుసుకుని నిర్ఘాంత పోయాను. నేను మాట్లాడే రాజకీయాలు, నేను నమ్మిన సిద్ధాంతాల కోసం అదానీ గ్రూప్ ఆర్థికంగా మద్దతు ఇచ్చే కార్యక్రమంలో అవార్డును స్వీకరించడం నాకు సంతోషంగా లేదు. కాబట్టి నేను 'దేవి అవార్డు'ని స్వీకరించడానికి నిరా కరిస్తున్నాను. అయితే నిపుణులబృందం ఎంపికతీర్పును మాత్రం గౌరవిస్తాను' అని పేర్కొనడం ఆమె విధేయతపటిమని స్పష్టంగా వెల్లడిస్తుంది.

1973 లో తమిళనాడులోని వేలూరు జిల్లాలోని లాలాపేట్ అనే గ్రామంలో నిరుపేద దళిత కుటుంబంలో సుకీర్తారాణి జన్మించారు. ఆ ప్రాంతంలోని పది దళితకుటుంబాలతో పాటుగా ఆమె ఒకరిగా పెరిగారు. ఆమె చిన్నప్పటి నుండి కులవివక్షని ఎదుర్కొన్నారు. నేను ఇంటి బయట అడుగు పెట్టగానే కులం 'కుక్క'లా వెంటాడుతుంది అని ఆమె ఆవేదన చెంది తక్షణమే సామాజిక కార్యాచరణ దిశగా ప్రేరణ పొందారు. "నా జీవితంలో ఒకానొక సమయంలో నా కులం గురించి నేను సిగ్గుపడ్డాను. మా పాఠశాలలో అధ్యాపకులు 'ముందడుగు వేసిన కులానికి చెందిన వారు ఎవరు', 'హరిజనులు ఎవరు' అని అడిగేవారు. కాని ఆ పదాలను నన్ను నేను బహిరంగంగా గుర్తించలేకపోయాను. ఒకానొక సమయంలో కుల గుర్తింపును అధిగమించాను. ఒక రకంగా నేను దళితురాలిని అయినందుకు గర్వపడ్డాను. చిన్నప్పుడు కులాన్ని అర్థం చేసుకోలేదు. దాన్ని ఎదుర్కొనే పరిపక్వత నాకు లేదు. అప్పుడు తికమక పడ్డాను. ఇప్పుడు నేను స్వేచ్ఛగా ఉన్నాను" అని ఆమె తన అంతరంగాన్ని బాహాటంగా వ్యక్తీకరించారు.

సుకీర్తారాణి ఆర్థికశాస్త్రం, తమిళ సాహిత్యంలో మాస్టర్స్ పూర్తి చేశారు. ఆమె వెల్లూరులోని రాణిపేట జిల్లాలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తమిళం బోధిస్తున్నారు. ఆమె చురుకైన స్త్రీవాది, సామాజిక కార్యకర్త. సుకీర్తారాణి తమిళంలో రాసే దళిత స్త్రీవాద కవయిత్రి. ఆమె కవితలు కులం, శరీరంచుట్టూ కేంద్రీకృతం అయ్యాయి. కుల వ్యవస్థ స్త్రీల శారీరక స్వేచ్ఛను ఎలా నిర్బంధిస్తుందో ఆమె తన రచనల ద్వారా బట్టబయలు చేశారు. కైపత్రి యెన్ కనవు కేల్, ఇరవు మిరుగమ్, కామత్తిపూ, తీండపడతా ముత్తం, అవలై మొజిపెయర్తాల్ ఇప్పదిక్కు ఏవల్ వంటి ఆరు కవితా సంకలనాలను సుకీర్తరాణి రచించారు. ఆమె తన రచనలద్వారా మరుగునపడిన అనేక విషయాలను వెలుగులోకి తీసుకువచ్చారు. తేవమగల్ కవితూవి పురస్కారం, పుతుమై పిత్తన్ స్మారక పురస్కారం, పెంగల్‌మున్నానిచే మహిళాసాధకుల పురస్కారం మొదలైన పురస్కారాలను సుకీర్తారాణి పొందారు. ముఖ్యంగా సుకీర్తారాణి కవితలు తమిళనాడులోని కళాశాల పాఠ్యాంశాలలో చేర్చారు. 2021 ఆగస్టులో ఢిల్లీ యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిల్ ఏకపక్షంగా ఇంగ్లీష్ హానర్స్ సిలబస్ నుండి సుకీర్తారాణి రాసిన బామా అలియాస్ ఫాస్టినా సూసైరాజ్ అనే పాఠ్యంశాన్ని తొలగించడం సర్వత్రా విమర్శలకు గురైంది. ఆమె కవితలు ఇంగ్లీష్, మలయాళం, కన్నడ, హిందీ, జర్మన్ భాషలలోకి అనువాదం చేశారు. కుల గుర్తింపు, స్త్రీ శరీరం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, దళిత స్త్రీల సమస్యలు ఇతర కులాల స్త్రీల కంటే భిన్నమైనవి అని సుకీర్తారాణి వ్యక్తిగతంగా భావించారు. ఆమె రచనలన్నీ నా స్వంత అనుభవాలు కావు, ముఖ్యంగా దళిత స్త్రీ అనుభవాలు అని ఆమె వ్యక్తీ కరించారు. మనమందరం కులసంకెళ్లలో ఉన్నాం అని, ముఖ్యంగా దళిత స్త్రీల శరీరాలు నిత్య హింసకు గురవుతున్నాయి అని, అగ్రవర్ణ స్త్రీలు అనుభవించే బాధలతో పోలిస్తే, దళితస్త్రీలు అధ్వాన స్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న ప్రస్తుత తరుణంలో ఆమె ప్రధానంగా స్త్రీ విముక్తి గురించి ముఖ్యంగా దళిత మహిళల అభ్యున్నతిపై దృష్టిని కేంద్రీకరించి ఆ దిశగా పురోగమి స్తున్నారు. 'ఆమె ఆకాంక్షలు సఫలీకృతం కావాలి' అని కోరుకుందాం. అంతిమంగా 'నమ్మిన ఆదర్శాలముందు అవార్డులు ఏమాత్రం సరితూగవు' అని సుకీర్తారాణి నిరూపించారు. ఏదిఏమైననూ 'నిర్జీవ అవార్డులకన్నా చరిత్రలో కల కాలం సజీవంగా మనగలిగే ఆదర్శాలు నూతన సమాజనిర్మాణానికి బాసటగా నిలుస్తాయి' అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

జె.జె.సి.పి. బాబూరావు, సెల్: 94933 19690.

పేదరికంలో అగ్రదేశం భారత్!

బొల్లిముంత సాంబశివరావు

ప్రపంచ వ్యాపితంగా 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలన్న లక్ష్యం చేరుకోవటం సాధ్యం కాదని ప్రపంచ బ్యాంక్ స్పష్టం చేసింది. ప్రపంచ జనాభాలో ఇప్పటికీ 72 కోట్ల మంది అత్యంత పేదరికంలో జీవిస్తున్నారని పేర్కొంది. ఆఫ్రికా ఖండంలోని దేశాలలో ఎక్కువ పేదరికం ఉందని తెలిపింది. ప్రపంచ బ్యాంక్ వెల్లడించిన పేదరికం లెక్కలు కూడా వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. ప్రపంచ వ్యాపితంగా పేదరికం తీరుతెన్నులపై బహుముఖ పేదరిక సూచీ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్(ఎంపీఐ)ని యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(యూఎన్‌పీడీ) ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యుమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ ఇటీవల వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా పేదలు ఎదుర్కొనే అనేకరకాల అంశాలను, అంటే చదువులేకపోవటం, పోషకాహారంలోపం, సరైన వైద్యసహాయం అందకపోవటం, రక్షిత మంచినీరు పథకాలు లేకపోవటం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ఈ సూచీ రూపొందించామని ఓపీహెచ్ నివేదిక పేర్కొంది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న 105దేశాల్లో 130కోట్ల మంది పేదలు ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది.

పేదరికం గురించి అనేకమంది ప్రముఖులు వ్యక్తంచేసిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. పేదరికం అనుభవించే వారి బాధను గుడ్డివారు కూడా చూడగలరు-ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్. పేదరికమనే సముద్రపుదీవుల్లో మనం ఎంతమాత్రం సంతోషంగా జీవించలేం- ఆర్థికవేత్త స్వామినాథన్. పేదరికం అత్యంత తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘన-కె జి బాలక్రిష్ణన్-సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి. భారత దేశంలో పేదరికం లెక్కలు తీవ్ర గందరగోళంగా ఉన్నాయి. భారత పాలకులు పేదరికాన్ని ఉద్దేశపూర్వకంగా తక్కువచేసి చూపుతున్నారు. భారతదేశంలో సుమారు 60కోట్ల మంది రోజుకి 3.65 డాలర్ల కంటే తక్కువ సంపాదనతో జీవిస్తున్నారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. ఇదికూడా క్షేత్రస్థాయిలో పరిశీలనచేసి చెప్పిందికాదు. చాలా మంది పేదలకు వంద రూపాయలకు మించి సంపాదన లేదు. తినీతినక బతుకుతున్నారు. 2005-06, 2015-16 మధ్య 63.5 కోట్ల నుంచి 36.4కోట్లకు పేదరికం తగ్గిందనే లెక్కలు చెబుతున్నారు. నీతి అయోగ్ 2021 నివేదిక ప్రకారం, భారతదేశంలో మొత్తం పేదరికం 25శాతం ఉంది. అంటే దేశ జనాభారీత్యా సుమారు 35 కోట్లమంది పేదరికంలో ఉన్నారు.

పేదరికం అనేది ఆర్థిక అసమానతల ఫలితంగా ఏర్పడింది. కనీస అవసరాలైన తిండి, గూడు, బట్టలు, వైద్యం, విద్యను పేదరికం దూరం చేస్తుంది. ఒక వ్యక్తి రోజుకి 2300 కేలరీల కంటే తక్కువ ఆహారం తీసుకుంటే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లుగా చెబుతున్నారు. భారతదేశంలోని గ్రామీణ ప్రాంతంలో 2400 కేలరీలు, పట్టణ ప్రాంతాల్లో 2100కేలరీల ఆహారం అవసరమని ప్రణాళికా సంఘం తెలిపింది. ఇది ప్రపంచ బ్యాంకు చెప్పిన ప్రమాణాల కన్నా తక్కువ. స్వాతంత్ర్యానికి పూర్వం దాదాబాయ్ నౌరోజీ జైల్లోని కనీస పౌష్టికాహారం ఆధారంగా పేదరికాన్ని అంచనా వేశాడు. పావర్టీ అండ్ ఇన్ బ్రిటిష్‌రూల్ ఇన్‌ఇండియా అనే పుస్తకంలో మన దేశంనుంచి బ్రిటన్‌కు సంపద తరిలిపోవటమే భారతదేశంలో పేదరికానికి కారణమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం పిడి ఓఝా, దండేకర్, నీలకంఠన్ నాద్, మిన్హాస్, పీకే బర్ధన్, మాంటెక్ సింగ్, ఆహ్లువాలియా

గౌరవదత్, రావెల్లీస్, లక్డావాలా తదితరులు పేదరికంపై అంచనా వేశారు. 1960కి పూర్వం పేదరికానికి సంబంధించిన అంచనాల్లో వ్యత్యాసాలు ఉన్నాయి. మన్హాస్ 37శాతం, అహ్లువాలియా 56శాతం, పీకే బర్ధన్ 54శాతంగా పేదరికాన్ని పేర్కొన్నారు. 1950లో జాతీయ నమూనా సర్వే సంస్థ (NSSO) భారత దేశంలో ఏర్పాటైంది. ఈ సంస్థ 1950 నుంచి 1973 వరకు ప్రతి సంవత్సరం పేదరిక గణాంకాలను అంచనా వేసింది. నెలసరి తలసరి వినియోగవ్యయాన్ని గ్రామీణప్రాంతంలో రూ.49, పట్టణ ప్రాంతంలో 56 రూపాయలగా నిర్ణయించారు. 1972-73 నుంచి ప్రతి ఐదు సంవత్సరాల కొకసారి పేదరిక గణాంకాలను సేకరించింది. 2019లో జాతీయ నమూనా సర్వే సంస్థను, కేంద్ర గణాంకాల సంస్థ (CSO)ను విలీనంచేసి జాతీయ గణాంకాల సంస్థను ఏర్పాటు చేశారు.

నాలుగవ పంచవర్ష ప్రణాళిక కాలంలో (1969-74) ఇందిరాగాంధీ 1971లో గరీబీ హఠావో నినాదం ఇచ్చింది. ఐదవ ప్రణాళికలో (1974-79) పేదరిక నిర్మూలనకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించి ఇందిరాగాంధి 20సూత్రాల పథకాన్ని ప్రకటించింది. దీని ద్వారా పేదరిక నిర్మూలన చేస్తానని ప్రకటించింది. పాలకుల పేదరిక నిర్మూలనకు చేపట్టిన కార్యక్రమాలు, పథకాలు ఆచరణలో విఫలమయ్యాయి. 1979లో పై కె అలఘ్ కమిటీ, 1993లో డాక్టర్ లక్డావాలా కమిటీ, 2005లో సురేష్ డి.తెందూల్కర్ కమిటీ అందులో భాగమే. 1993లో లక్డావాలా అధ్యక్షతనఉన్న కమిటీ రాష్ట్రాలమధ్య ధరల వ్యత్యాసాన్ని, రాష్ట్రాల ప్రత్యేక వినియోగ ధరలసూచి ఆధారంగా పేదరికాన్ని సూచించింది. తెందూల్కర్ కమిటీ తన నివేదికను 2009 కేంద్ర ప్రభుత్వానికి అందచేసింది. నివేదికలో పేదరికం దిగువన ఉన్నవారి రోజువారి ఖర్చు పట్టణప్రాంతాల్లో 32, గ్రామీణ ప్రాంతంలో 26 రూపాయలుగా పేర్కొంది. ఆ పైన ఆదాయం ఉన్నవారు పేదరికానికి ఎగువన ఉన్నవారిగా పేర్కొంది. ఇది పేదరికాన్ని అపహాస్యం చేయటమే. నివేదిక ఇచ్చిన తెందూల్కర్ గాని, మంత్రులు గానీ, ఒకరోజు ఈ ఖర్చుతో జీవిస్తే తెలుస్తుంది పేదరికం అంటే ఏలా ఉంటున్నది. తెందూల్కర్ కమిటీ నివేదికపై సర్వత్రా విమర్శలు రావటంతో, ఆయన సూచించిన పేదరిక అధ్యయన పద్ధతిని సమీక్షించేందుకు 2012లో రంగరాజన్ అధ్యక్షతన కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ ప్రతి పదిమందిలో ముగ్గురు పేదరికంలో ఉన్నట్లు పేర్కొంది. సురేశ్ తెందూల్కర్ కమిటీ పేదరికాన్ని 21.9శాతంగా పేర్కొనగా, రంగరాజన్ కమిటీ 29.5శాతంగా పేర్కొంది. మోదీ నాయకత్వాన ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా తెందూల్కర్ నివేదికపైనే మొగ్గు ఫలితంగా ఎనిమిది సంవత్సరాల మోదీ ప్రభుత్వ పాలనలో 7కోట్ల, 60లక్షల మంది అదనంగా నిరుపేదల జాబితాలో చేరారు. ప్రపంచ దేశాల్లో తన పరువుపోయి, అవమానంపాలు కావాల్సి వస్తుందని పేదరికాన్ని తగ్గించి చూపేందుకు తనకు అనుకూలమైన వారితో యూపీఏ, ఎన్‌డీఏ ప్రభుత్వాలు కమిటీ నాటకాన్ని తెరపైకి తెచ్చాయి. ఈ కమిటీలేవీ క్షేత్రస్థాయిలోకివెళ్లి లోతుగా పరిశీలన జరిపి పేదరికాన్ని అంచనావేయకుండా ప్రభుత్వాలకు అనుకూలంగా పేదరికాన్ని తగ్గించి నివేదికలు ఇచ్చాయి. కనీస రోజూ వారీ జీవనవ్యయం వీరికి తెలిసికూడ తక్కువచేసి చెప్పారు.

యూపీఏ, ఎన్‌డీఏ ప్రభుత్వాలు పేదరికాన్ని నిర్మూలించేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాయి. ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(IRDP), జవహర్ గ్రామ అభివృద్ధియోజన, రూరల్ హౌసింగ్-ఇందిరా అవాస్ యోజన, పనికోసం అహార కార్యక్రమం, జాతీయ వృద్ధాప్య పెన్షన్, సంపూర్ణ రోజ్‌గార్ యోజన, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(దీనదయాళ్ అంత్యోదయ యోజన), మహాత్మా గాంధి గ్రామీణ ఉపాధి హామీపథకం, జాతీయ పట్టణ జీవనోపాధి పథకం, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, జాతీయ ఆహార భద్రతా చట్టం, ప్రధాన మంత్రి అవాస్ యోజన(గ్రామీణ పట్టణ), ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజన మొదలైన పథకాలు అందులోనివే. ఈ పథకాలేవీ పేదరికాన్ని రూపమాపలేక పోయాయి. పేదరికానికి మౌలిక కారణం ఆర్థిక వ్యత్యాసాలు. భారత సామాజికవ్యవస్థ వర్గ వైరుధ్యాలతో కూడి ఉంది. గ్రామీణ పేదల జీవనోపాధి అయిన భూమి, కార్మికుల శ్రమశక్తితో పనిచేసే పరిశ్రమలు కొద్దిమంది భూస్వాముల, బడా పెట్టుబడిదారుల ఆధీనంలో ఉన్నాయి. ఫలితంగా దేశ సంపదలో ఒక శాతం మంది వద్ద 25శాతం పైగా ఉంటే, 60శాతం ప్రజల వద్ద 19శాతం సంపద మాత్రమే ఉంది. 28శాతం ప్రజల రోజువారీ ఆదాయం 160 రూపాయలు మాత్రమే. దీన్ని గమనిస్తే ఆర్థిక వ్యత్యాసాలు ఏ స్థాయిలో ఉందీ వెల్లడౌతుంది. విప్లవ భూసంస్కరణలద్వారా గ్రామీణ పేదలకు భూ పంపిణీ,పారిశ్రామిక రంగంలో కార్మికులకు భాగస్వామ్యం, శ్రమకు తగ్గ వేతనం అమలుజరిగి ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు కల్పించాలి. బడా భూస్వామ్య, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం పనిచేస్తున్న దేశ పాలకులకు వీటిని అమలు జరపరు. వీటికోసం ప్రజలు ఉద్యమాలు చేయకుండా పక్కదారిపట్టించటానికి బూటకపు సంక్షేమపథకాలను ముందుకు తెస్తున్నారు. పాలకులకు వ్యతిరేకంగా తమ పేదరికానికి కారణమైన మౌలిక సమస్యల పరిష్కారానికి పేదలు ఉద్యమించాలి.

రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రైతు కూలీ సంఘం (అం.ప్ర.)
సెల్: 9885983526

కులవివక్షను ప్రశ్నిస్తున్న బహుజనులు-ఇరకాటంలో ఆర్ఎస్ఎస్!

ఎం కోటేశ్వరరావు

అయోధ్యలో రామాలయ నిర్మాణం మీద చూపుతున్న శ్రద్ధ, వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల ముందు జనం దృష్టికి తెచ్చేందుకు ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ నేతలు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. ప్రధాని పదవి చేపట్టిన తరువాత ఆరవసారి నరేంద్రమోదీ 2022 అక్టోబరులో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌ను సందర్శించారు. ప్రభుత్వాలు హజ్ యాత్రకు సహకరించటాన్ని, సబ్సిడీలు ఇవ్వటం గురించి గతంలో బీజేపీ పెద్ద వివాదాన్ని సృష్టించాడు. అసోంలో తాజాగా బీజేపీ ప్రభుత్వం శివరాత్రి సందర్భంగా జారీ చేసిన ప్రకటనలో భక్తులు, యాత్రీకులు కామరూప్ జిల్లాలోని దాకిని కొండ మీద ఉన్న భీమేశ్వర దేవాలయాన్ని సందర్శించాలని కోరింది. ప్రభుత్వం ప్రతి మతానికి చెందిన పండుగల సందర్భంగా ఇలాంటి ప్రకటనలు ఇస్తుంటే అదొకదారి, కానీ హిందూ పండగలకే ఇవ్వటం వివాదాస్పదమైంది. తాజాగా సిఎం యోగి ఆదిత్యనాథ్ గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌నాథ్ ఆలయంలో శివరాత్రి పూజలు చేశారు. తమిళ కాశీ సంగం సమావేశాల్లో గతేడాది నవంబరులో మాట్లాడుతూ తమిళ భాష ఎంతో పురాతనమైనది, ఘనమైన సాహిత్యాన్ని కలిగి ఉంది అంటూనే రెండు భాషలూ శివుడి నోటి నుంచి వచ్చినవే అని చెప్పారు. తమ నేత ఒక శివభక్తుడని రాజస్తాన్ సిఎం అశోక్ గెహ్లాట్ గతంలో చెప్పారు. ఈ ఏడాది శివరాత్రి సందర్భంగా రాహుల్ గాంధీ ఏ క్షేత్రాన్ని సందర్శించారో తెలీదు గాని శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ప్రకటన చేశారు. మన దేశంలో కొన్ని రాజకీయ పార్టీలు మతాన్ని, దేవుళ్లను వీధుల్లోకి తెస్తున్న సంగతి తెలిసిందే. 2021లో అమెరికా చెందిన "పూ" సంస్థ మన దేశంలో ఒక సర్వే నిర్వహించింది. దానిలో వెల్లడైన కొన్ని అంశాలను చూస్తే ఎందుకు దేవుళ్ల కోసం రాజకీయ పార్టీలు వెంపర్లాడుతున్నదీ అర్థం అవుతుంది. 2019 నవంబరు నుంచి 2020 మార్చి వరకు మన దేశంలో 29,999 మందిపై చేపట్టిన సర్వేలో 22,975 హిందువులు, 3,330 ముస్లింలు,1,782 సిక్కులు,1,011 క్రైస్తవులు, 719 బౌద్ధులు, 109 జైనులు,67 మంది ఏమతం లేని వారు ఉన్నారు. 2019 ఎన్నికల అనంతరం జమ్మూకాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తరువాత జరిపిన సర్వే ఇది. 2019 ఎన్నికల్లో పార్టీల వారీగా హిందువులు బీజేపీకి 49శాతం, కాంగ్రెస్‌కు 13శాతం ఓటు వేశారు. ముస్లింలలో కాంగ్రెస్‌కు 30, బీజేపీకి 19శాతం, క్రైస్తవుల్లో కాంగ్రెస్‌కు 30, బీజేపీకి పదిశాతం, సిక్కుల్లో కాంగ్రెస్‌కు 33, బీఏపీకి 19, బౌద్ధుల్లో బీజేపీకి 29, కాంగ్రెస్‌కు 24శాతం మంది ఓటు వేశారు. ఈ ధోరణి 2014 నుంచి ఉంది. ఎవరి ఓటు బ్యాంకును వారు కాపాడుకొనేందుకు హిందువుల ఓట్లకోసం కాంగ్రెస్ నేతలు, మైనారిటీల ఓట్లకోసం బీజేపీ నేతలు వెంపర్లాడుతున్నారనేది స్పష్టం.

దేశంలో ప్రజాస్వామిక వ్యవస్థ పట్ల విశ్వాసం తగ్గుతున్నదని ఈ సర్వే పేర్కొంది. మొత్తంగా ప్రజాస్వామ్య నాయకత్వం కావాలని 46శాతం మంది చెప్పగా, బలమైన నేత కావాలని చెప్పిన వారు 48శాతం. హిందువుల్లో మొదటిదానికి 45 శాతం మద్దతు పలకగా, రెండవ దానికి 50శాతం మంది మద్దతిచ్చారు. బలమైన నేత కావాలని స్త్రీలు 48, పురుషులు 49శాతం మంది కోరగా, ప్రజాస్వామ్యం కావాలని 44, 47శాతం మంది పేర్కొన్నారు. తెలంగాణాలో బిజెపి నేతలు హైదరాబాద్‌లోని వివాదాస్పద భాగ్యలక్ష్మి ఆలయం (చార్మినార్ వద్ద ఒక మినార్ పక్కనే తెచ్చిపెట్టిన విగ్రహం) నుంచే దాదాపు ప్రతి కార్యకమాన్ని ప్రారంభిస్తారు, కర్ణాటకలో ముస్లిం విద్వేషాన్ని రెచ్చగొట్టటం తెలిసిందే. కేరళలో ముస్లిం, క్రైస్తవ విద్వేషం ఇలా దక్షిణాది రాష్ట్రాలలో మత ప్రాతిపదికన ఓటు బ్యాంకు ఏర్పాటు చేసుకొనేందుకు బీజేపీ ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటున్నది. 2019 ఎన్నికల్లో హిందువులలో బీజేపీకి ఓటు వేసింది 49శాతమే. వీరు దేశ జనాభాలో 80శాతంవరకు ఉన్నారు. ప్రాంతాల వారీ చూస్తే ఉత్తరాదిన 68శాతం, మధ్యభారత్‌లో 65, పశ్చిమాన 56, తూర్పున 46, దక్షిణాదిన 19శాతం మాత్రమే ఉన్నారు. ఈ కారణంగానే దక్షిణాది మీద బీజేపీ కేంద్రీకరిస్తున్నది. నిజమైన భారతీయుడు అంటే హిందూ అన్నట్లుగా హిందూ అంటే హిందీ, హిందీ మాట్లాడేవారంటే హిందువులే అన్న భావనను రేకెత్తించేందుకు బీజేపీ చూస్తోంది. దానిలో భాగంగానే దేశం మొత్తం మీద హిందీని బలవంతంగా రుద్దాలన్న యత్నం. పూ సర్వే ప్రకారం నిజమైన భారతీయుడు హిందువుగా ఉండాలని భావిస్తున్నవారు 55శాతం, హిందీ మాట్లాడాలని చెప్పిన వారు 59, హిందూగా ఉండటం హిందీ మాట్లాడటం అనేవారు 60శాతం ఉన్నారు. ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యం తరువాత జనం మత వ్యవహారాల్లో రాజకీయపార్టీల, నేతల జోక్యాన్ని సమర్థించేవారు అన్ని మతాల్లో మూడింట రెండువంతుల మంది ఉండటం ఆందోళన కలిగించే అంశం. కొన్ని శక్తులు నిస్సిగ్గుగా మతాన్ని-రాజకీయాన్ని మిళితం చేస్తున్నాయి. మత పెద్దలమని చెప్పుకొనే వారు రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారు. పూ సర్వే ప్రకారం మొత్తంగా చూసినపుడు 62శాతం మంది మత వ్యవహారాల్లో రాజకీయపార్టీల ప్రమేయాన్ని సమర్థించారు. ముస్లింలలో రాజకీయపార్టీల ప్రమేయం ఉండాలన్న వారు 59శాతం, వద్దన్నవారు 35శాతం.మెజారిటీ మతతత్వం ఎంత ప్రమాదకరమో మైనారిటీ మతతత్వం కూడా అంతే ప్రమాదకరం. నిరుద్యోగం ప్రధాన సమస్య అని భావిస్తున్నవారు అందరిలో 84శాతం మంది ఉండగా, అవినీతి అని 76, మహిళలమీద నేరాలని 75, మతహింస అని 65శాతం మంది భావించారు. ఆర్ఎస్ఎస్ అనుకున్నట్లుగా లోకం నడవదు. రామచరిత మానస్‌లో వెనుకబడిన తరగతుల వారిని కించపరిచినట్లు వచ్చిన వివాదం తరువాత ఆ సామాజిక తరగతులను సంతుష్టీకరించేందుకు ఆర్ఎస్ ఎస్ నేత మోహన్ భగవత్ రంగంలోకి దిగారన్నది ఒక అభిప్రాయం. తాము చెప్పే హిందూత్వ సనాతనమైనదని దానిలో కులాలు లేవని జనాన్ని నమ్మిం చేందుకు బిజెపి చూస్తున్నది. మోహన్‌భగవత్ ఈ ఏడాది ఒకదగ్గర మాట్లాడుతూ కులాలను సృష్టించింది పండితులే అని సెలవిచ్చారు. వెనుకబడిన తరగతులు, దళితులు, మహిళలను కించపరుస్తూ తులసీదాస్ రామచరిత మానస్‌లో రాశారన్న విమర్శలను సమాజవాదీ, ఆర్‌జెడి నేతలు ముందుకు తెచ్చిన పూర్వరంగంలో భగవత్ ఈ మాటలు చెప్పారని అనుకోవచ్చు. ఈ దేశంలో పండితులు అంటే బ్రాహ్మలే కదా ! దాని మీద ఆర్ఎస్ఎస్‌లోని బ్రాహ్మలు, వెలుపల ఉన్న వారిలో కూడా గగ్గోలు తలెత్తటంతో నష్టనివారణగా ఒక వివరణ ఇచ్చారు.

కులవ్యవస్థ ఉనికిలోకి వచ్చిన నాటి నుంచి బ్రాహ్మణులు తప్ప వేదాలు చదివిన వారు ఇతర కులాల్లో ఎవరూ లేరు. వేదాల్లో ఉన్నదే చెబుతున్నారా అసలు వాటిలో ఉన్నదేమిటి అని తెలుసుకొనే ఆసక్తి కలిగిన వేళ్ల మీద లెక్కించగలిగిన వారు తప్ప వేదాలను చదివే ఇతర కులస్థులు ఎంత మంది ఉన్నారు? ఇటీవలి వరకు అసలు ఇతరులను చదవనివ్వలేదు. నిన్న మొన్నటి వరకు శూద్రులు, అంటరాని వారిగా ముద్రవేసిన వారికి కనీస చదువు సంధ్యలు కూడా లేవు కదా. అలాంటపుడు ఇతర కులాల్లోని ఏ పండితులు తమను తాము కించపరుచుకొనే విధంగా అంతరాలతో కులాలను ఎందుకు సృష్టించినట్లు? చదువుకున్నది బ్రాహ్మల తరువాత క్షత్రియులు, వైశ్యులు మాత్రమే. అంటే ఈ కులాలకు చెందిన మేథావులు అనుకుంటే అందులో బ్రాహ్మల వాటా ఎంత? ఇతరుల వాటా ఎంతో ఆర్ఎస్ఎస్ నిపుణులు వేదగణితంతో గుణించి చెప్పాలి. కుల వ్యవస్థ పోవాలని ఇప్పటికైనా ఆర్ఎస్ ఎస్ చెప్పటం, మారుమనస్సు పుచ్చుకోవటం మంచిదే. అందుకోసం వారు చేసిందేమిటి ?మాటలకే పరిమితం, చిత్తశుద్ధి ఎక్కడా కనిపించదు. గమనించాల్సిందేమంటే కులాల సృష్టి పండితులదే అని చెప్పటంతో హిందూ, బ్రాహ్మణ వ్యతిరేకం అంటూ హిందూత్వ అనుకూలురు మోహన్ భగవత్ మీద మండి పడుతున్నారు. పండితుల గురించి ఇచ్చిన వివరణను ఏ పండితులూ జీర్ణించుకోవటం లేదు. మరోవైపు పండితులుగా ముద్రవేసుకున్న వారు, ఆర్ఎస్ఎస్ మద్దతుదారులు కులవ్యవస్థను సమర్థించే మనుస్మృతి పుస్తకాలను అచ్చు వేయించి ప్రచారం చేస్తున్నారు. దక్షిణాదిలో మనువాదం, దానికి ప్రతినిధులుగా ఉన్న బ్రాహ్మణులమీద ధ్వజమెత్తుతూ పెద్ద ఉద్యమం నడిచింది. బ్రాహ్మణులకు ప్రత్యామ్నాయంగా కొన్ని చోట్ల కమ్మ బ్రాహ్మణులు వివాహతంతు వాటిని నిర్వహించిన రోజులు ఉన్నాయి. ఇటీవలి కాలంలో బ్రాహ్మణులు కాకున్నప్పటికీ బ్రాహ్మణవాదాన్ని తలకు ఎక్కించుకున్న అనేకమంది వర్ణవ్యవస్థకు, హిందూత్వకు ముప్పు వచ్చిందంటూ వీధుల్లోకి వస్తున్నారు. ఇప్పటికీ తంతుల పేరుతో బ్రాహ్మణులు జనాన్ని దోచుకుతింటున్నారని, పరాన్న భుక్కులుగా ఉన్నారంటూ వ్యతిరేకతను వెల్లడించటాన్ని చూడవచ్చు. ఉత్తరాదిలో బీజేపీ మద్దతుదార్లుగా ఉన్న దళితులు,వెనుకబడిన తరగతులు తమ పట్ల వివక్షను ప్రదర్శించే మనుస్మృతి, పురాణాల గురించి ప్రశ్నిస్తున్నారు. ఓటు బ్యాంకుగా ఉన్న బలహీనవర్గాలు లేవనెత్తే సామాజిక వివక్ష, కించపరచటాన్ని ప్రశ్నిస్తుండటంతో, హిందూత్వ అంటే కులాలు లేనిది అనే పల్లవిని ఆర్ఎస్ఎస్ అందుకుంది. ఇప్పటివరకు తమకు మద్దతుదార్లుగాఉన్న బ్రాహ్మలు, బ్రాహ్మణవాదులు దాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఉత్తరాదిన బహుజనుల్లో ప్రారంభమైన ఈ ప్రశ్నించే, వివక్షను ఖండించేతత్వం మరింత పెరగటం అనివార్యం.

2024లో కూటమిదే అధికారం

- వందమంది మోదీ, షాలు వచ్చినా విజయం మాదే
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే

కోహిమా: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించే ప్రతిపక్ష సంకీర్ణానికి కాంగ్రెస్ నాయకత్వం వహిస్తుందని, ఇందుకోసం 'ప్రతి' ఇతర పార్టీలతో చర్చలు జరుపుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే ప్రకటించారు. నాగాలాండ్ ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన బుధవారం ప్రసంగిస్తూ బీజేపీపై మరోసారి విరుచుకుపడ్డారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేకసార్లు దేశాన్ని ఎదుర్కోగల ఏకైక వ్యక్తిని నేను. ఇతర వ్యక్తులు ఎవరూ నన్ను తాకలేరు' అని చెప్పారన్నారు. 'ప్రజాస్వామ్యవాది ఎవరూ ఇలా అనరు. మీరు ప్రజాస్వామ్యంలో ఉన్నారు. మీరు నిరంకుశుడివి కాదని గుర్తుంచుకోవాలి. మీరు నియంత కాదు, మీరు ప్రజలచే ఎన్నుకోబడ్డారు' అని చెబుతూ ప్రజలే మీకు గుణపాఠం చెబుతారని అన్నారు. '2024లో కేంద్రంలో కూటమి ప్రభుత్వం వస్తుంది. కాంగ్రెస్ నాయకత్వం వహిస్తుంది. ఇతర పార్టీలతో మాట్లాడుతున్నాం, లేకపోతే ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పోతుంది' అని ఖడ్గే తెలిపారు. 'అందుకే ప్రతి పార్టీని అప్పుడప్పుడు పిలిచి మాట్లాడుతున్నాం. అభిప్రాయాలు పంచుకుంటున్నాం. బీజేపీకి మెజారిటీ రాదు. మిగతా పార్టీలన్నీ కలిసి మెజారిటీ సాధిస్తాం. 100 మంది మోదీలు లేదా షాలు రండి' అని ప్రధానిని, ఆయన ప్రధాన వ్యూహకర్త హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి అన్నారు. 'స్వాతంత్ర్యం కోసం మన ప్రజలు ప్రాణాలర్పించారు.. కాంగ్రెస్... మీ బీజేపీ వాళ్లు కాదు. చెప్పండి... ఏ బీజేపీ నాయకుడినైనా స్వాతంత్ర్యం కోసం ఉరి తీశారా? లేదా స్వాతంత్ర్యం కోసం పోరాడారా? జైలుకు వెళ్లారా? బదులుగా స్వాతంత్ర్యం తెచ్చిన వ్యక్తి మహాత్మా గాంధీని వాళ్లు చంపారు. మరి అలాంటి వాళ్లు దేశభక్తి గురించి మాట్లాడుతున్నారు?' అని ఆయన అన్నారు. 'దేశ సమైక్యత కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలర్పించారు. తమకు 2014లోనే స్వాతంత్ర్యం వచ్చిందని వారు అనుకుంటున్నారు. వారికి 1947 గుర్తులేదు' అని ఖడ్గే అన్నారు. 'ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెచ్చి ఆరు, ఏడు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. కర్ణాటకలో కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ 17 నుంచి 18 మంది ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేసి, వారితో రాజీనామా చేయించి ప్రభుత్వాన్ని చేజిక్కించుకుంది. మధ్య ప్రదేశ్, గోవా, మణిపూర్, ఉత్తరాఖండ్... ఇలా ప్రతిచోటా ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని మల్లికార్జున ఖడ్గే తీవ్ర విమర్శలు చేశారు. నాగాలాండ్ ప్రజలను బీజేపీ మోసం చేసిందని అన్నారు. '20 ఏళ్లుగా నేషనల్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ), బీజేపీ నాగాలాండ్‌ను లూటీ చేశాయి. ఇక్కడి ప్రజలు భిన్నమైన సంప్రదాయాలను బీజేపీ నాశనం చేస్తోంది. విభజన, ద్వేషం నింపే రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలి. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు కీలకమైన సమయం ఇదే' అని ఖడ్గే పిలుపునిచ్చారు. నాగాలాండ్‌లోని 60 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 27న ఒకే రోజు పోలింగ్ జరగనుంది. మార్చి 2న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు. గతవారం ఎన్నికలు జరిగిన త్రిపురలో కాంగ్రెస్ తన చిరకాల ప్రత్యర్థి వామపక్షాలతో జతకట్టింది.

'వర్గ రౌడీ' బీజేపీ ఎవరినీ గౌరవించదు: రాహుల్ గాంధీ

షిల్లాంగ్: తమకు అన్నీ తెలుసునని భావించే బీజేపీ ఎవరినీ గౌరవించని 'క్లాస్ రౌడీ' లాంటిదని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ బుధవారం ఆరోపించారు. మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ, ఈశాన్య రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి టీఎంసీ ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేస్తుందని విమర్శల దాడి చేశారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ తనకు అన్నీ తెలుసని, అన్నీ అర్థం చేసుకున్నామని, ఎవరికీ గౌరవం ఇవ్వనవసరం లేదని భావించే వర్గ రౌడీలాంటివని, వాటితో సమష్టిగా పోరాడాలని రాహుల్ అన్నారు. మేఘాలయ భాష, సంస్కృతి, చరిత్రకు హాని కలిగించే బీజేపీని కాంగ్రెస్ అనుమతించబోదని అన్నారు. ర్యాలీలో రాహుల్ గాంధీ తాను ధరించిన సాంప్రదాయ జాకెట్‌ను చూపిస్తూ, 'మీ సంస్కృతి, సంప్రదాయానికి గౌరవ సూచకంగా నేను దానిని ధరించాను. నా చర్యలు ఈ జాకెట్‌ను ప్రతిబింబిస్తాయి. కానీ, ప్రధాన మంత్రి లాగా నేనూ ఇక్కడికి వస్తే, ఈ జాకెట్ వేసుకుని... మీ మతం, సంస్కృతి, చరిత్ర, భాషపై దాడికి దిగితే మిమ్మల్ని అవమానించినట్టే' అని రాహుల్ గాంధీ అన్నారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లో హింస, కుంభకోణాలను లేవనెత్తుతూ మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై కూడా విరుచుకుపడ్డారు. 'టీఎంసీ చరిత్ర గురించి మీకు తెలుసు. పశ్చిమ బెంగాల్‌లో జరిగే హింస, కుంభకోణాలు. వారి సంప్రదాయం గురించి మీకు తెలుసు. వారు గోవాలో (ఎన్నికలు) భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేశారు. బీజేపీకి సహాయం చేయాలనే ఆలోచనతో ఉన్నారు. మేఘాలయలో టీఎంసీ ఆలోచన బీజేపీని బలోపేతం చేసి అధికారంలోకి రావడమే' అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని కాన్రాడ్ కె సంగ్మా నేతృత్వంలోని ఎండీఏ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని అన్నారు.

పెళ్లి ఎందుకు చేసుకోలేదో తెలియదు

నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి తానంటే ఎంతో ఇష్టమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. ఇటలీలో నివసించిన అమ్మమ్మ పావ్‌లామాయినోకు సోదరి ప్రియాంకా గాంధీ అంటే ప్రాణమని చెప్పారు. ఇటాలియన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాహుల్‌గాంధీ ఈ విషయాలు వెల్లడించారు. ఇంకా ఎందుకు వివాహం చేసుకోలేదన్న ప్రశ్నకు రాహుల్ బదులిస్తూ....ఆ విషయం తనకే విచిత్రంగా ఉందని, వివాహం ఎందుకు చేసుకోలేదో తెలియదన్నారు. చాలా పనులు చేయాల్సి ఉందన్న రాహుల్.. తనకు పిల్లలు కావాలని ఉందని వ్యాఖ్యానించారు. కశ్మీర్ నుంచి భారత్ జోడో యాత్రకు సంబంధించిన విషయాలను రాహుల్ ఆ పత్రికతో పంచుకున్నారు. యాత్ర పూర్తయ్యే వరకు గడ్డం గీసుకోరాదని భావించినట్లు తెలిపారు. ఇప్పుడు ఆ గడ్డాన్ని ఉంచాలా లేదా తీసివేయాలా అనేది తాను నిర్ణయించుకోవాల్సి ఉందన్నారు.

అఖిల్ గొగోయ్‌కు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం-2019(సీఏఏ) వ్యతిరేక నిరసనలు, మావోయిస్టులతో సంబంధాలకు సంబంధించిన కేసులో అసోం స్వతంత్ర ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో తనను అరెస్టు చేయరాదన్న గొగోయ్ అభ్యర్థనను మన్నించిన సుప్రీంకోర్టు... అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నుంచి ప్రతిస్పందనను కోరింది. పౌరసత్వ సవరణ చట్టం వ్యతిరేక నిరసనల సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పిన ఎమ్మెల్యే గొగోయ్... ఈ రెండు కేసుల్లో ఒక దానిలో అభియోగాల రూపకల్పనను కొనసాగించేందుకు అసోంలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టుకు అనుమతిస్తూ ఫిబ్రవరి 9న గుహవతి హైకోర్టు బెంచ్ ఆదేశాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తులు వి.రామసుబ్రమణియన్, పంకజ్ మిథాల్‌లతో కూడిన ధర్మాసనం.. గొగోయ్‌ను ఏ విధంగానూ అరెస్టు చేయవద్దని, ఇది మంచి పద్ధతి కాదని ఆదేశించింది.

శ్రీనగర్‌లో నిరుద్యోగుల నిరసన

శ్రీనగర్: అగ్నిమాపక, అత్యవసర సేవల(ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్)లో వివిధ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగార్థులు బుధవారం శ్రీనగర్‌లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. నియామక ప్రక్రియలో అవకతవకల ఆరోపణలపై విచారించడానికి ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను జమ్మూకశ్మీర్ ప్రభుత్వం బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. రెసిడెన్సీ రోడ్‌లోని ప్రెస్ కాలనీలో 'మాకు న్యాయం కావాలి' అని రాసి ఉన్న బ్యానర్లు, ప్లకార్డులను పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. 'ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ చేసిన అన్యాయానికి నేను బాధితురాలిని. 2012లో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోగా అవినీతి కుంభకోణం జరిగినట్లు తేలింది. మేము 2018లో మళ్లీ దరఖాస్తు చేసుకోగా అప్పుడు కూడా కుంభకోణం బయట పడింది. గత ఏడాది మరోసారి వెలుగు చూసింది' అని నిరసనకారులలో ఒకరైన బిలాల్ అహ్మద్ షేక్ పీటీఐకి చెప్పారు. గతేడాది డిసెంబరులో జరిగిన అక్రమాలపై విచారణ జరిపేందుకు హోంశాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఆర్కే గోయల్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు షేక్ తెలిపారు. కమిటీ ఒక నెలలో నివేదిక ఇవ్వాల్సి ఉండగా, మూడు నెలలు గడుస్తున్నా కదా నివేదిక రాలేదన్నారాయన. ప్రభుత్వం నివేదికను బహిరంగపరిచేవరకు ఆందోళన కొనసాగిస్తామని మరో నిరసనకారుడు ఖుర్షీద్ అహ్మద్ పర్రే అన్నారు.

సిసోడియా విచారణకు కేంద్రం ఓకే



న్యూఢిల్లీ: మేయర్ ఎన్నిక వేళ...ఢిల్లీ ఉపముఖ్య మంత్రి మనీశ్ సిసోడియాకు కేంద్ర హోంశాఖ షాకిచ్చింది. ఫీడ్‌బ్యాక్ యూనిట్ స్నూపింగ్ కేసులో అవినీతి నిరోధక చట్టం కింద ఆయనను విచారించేందుకు కేంద్ర హోం శాఖ అనుమతి ఇచ్చింది. ప్రభుత్వంలోని వివిధ శాఖలు, అందులోని ఉద్యోగులు ఎలా పని చేస్తున్నారో సమాచారం సేకరించి.. తగిన చర్యలు తీసుకోవాలని సూచించేదే ఈ ఫీడ్‌బ్యాక్ యూనిట్. దీన్ని 2015లో ఢిల్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రూ.కోటి నిధులతో 2016 నుంచి ఇది పని చేయడం ప్రారంభించింది. 60 శాతం అవినీతికి సంబంధించి ఇది పనిచేస్తే.. 40శాతం రాజకీయ అవసరాలకు ఉపయోగపడిందని సీబీఐ ఆరోపించింది. రూ.36 లక్షలు దీనికోసం దుర్వినియోగం చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. వివిధ శాఖల్లో అక్రమాలను తనిఖీ చేయడానికి ఆప్ సర్కారు నియమించిన ఫీడ్‌బ్యాక్ యూనిట్(ఎఫ్‌బీయూ)ను ప్రభుత్వం రాజకీయంగా వాడుకొని దుర్వినియోగం చేసిందని సీబీఐ ఆరోపించింది. ఇందులో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పాత్ర అధికంగా ఉందని, ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని వ్యాఖ్యానించింది. సిసోడియా, ఎఫ్‌బీయూ డైరెక్టర్‌తో పాటు ఇందులో పాత్ర ఉన్నవారిపై కేసులు నమోదు చేయడానికి లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను సీబీఐ అభ్యర్థించింది. అందుకు అంగీకరించిన సక్సేనా.. దానిని కేంద్ర హోంశాఖకు పంపారు. ఈ క్రమంలో విచారణకు కేంద్రం నుంచి అనుమతి వచ్చిందని ఎల్‌జీ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. కాగా, ఈ వార్తలపై సిసోడియా ఘాటుగా స్పందించారు. 'ప్రత్యర్థులపై కేసులు బనాయించడం బలహీన, పిరికితనానికి నిదర్శనం. ఆప్ ఎదుగుతున్న కొద్దీ ఇలాంటి కేసులు మరిన్ని వస్తూనే ఉంటాయి' అని సిసోడియా ట్విటర్‌లో పోస్టు పెట్టారు. కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడినప్పటికీ.. అదానీ గ్రూప్‌పై ఎలాంటి విచారణ జరగడం లేదని ఆప్ నేతలు విరుచుకుపడ్డారు.

ఉక్రెయిన్ వైద్య విద్యార్థులకు ఝలక్

వైద్య కళాశాలల్లో చేర్చుకోం: కేంద్రం

న్యూఢిల్లీ: ఉక్రెయిన్ నుంచి వచ్చిన వైద్య విద్యార్థులకు మోదీ సర్కారు ఝలక్ ఇచ్చింది. విద్యార్థులకు ఎలాంటి నష్టమూ కలగనివ్వబోమని, అన్ని విధాలుగా ఆదుకుంటామని నాడు భరోసా ఇచ్చిన కేంద్రం తాజాగా చేతులెత్తేసింది. బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్‌కు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డా.మన్‌సుఖ్ మాండవియా ఈ మేరకు లేఖ రాశారు. ఉక్రెయిన్‌లో చదువుకుంటున్న భారతీయ వైద్య విద్యార్థుల సమస్యల గురించి 2022 డిసెంబర్ 13న లోక్‌సభ జీరో అవర్‌లో బీబీ పాటిల్ మాట్లాడారు. బీబీ పాటిల్ లేవనెత్తిన అంశాలకు కేంద్రమంత్రి లేఖలో పూర్తి సమాచారం ఇచ్చారు. విదేశాల్లో చదువుకున్న వైద్య విద్యార్థులకు దేశంలోని మెడికల్ కాలేజీల్లో చేర్చుకోడానికి అవకాశం లేదని, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం-1956, నేషనల్ మెడికల్ కమిషన్ యాక్ట్ - 2019లో ఆ తరహా అవకాశం కల్పించలేదని మంత్రి మాండవీయ లేఖలో తెలిపారు. అయితే సుప్రీంకోర్టు గతేడాది జులైలో ఇచ్చిన తీర్పు ప్రకారం కోవిడ్-19, ఉక్రెయిన్-రష్యా యుద్ధం కారణంగా తమ వైద్య విద్యను కొనసాగించలేకపోయిన చివరి సంవత్సరం విద్యార్థులకు మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ పరీక్ష రాయడానికి అనుమతిస్తున్నామని పేర్కొన్నారు. ఆ పరీక్షలో అర్హత సాధించిన వైద్య విద్యార్థులు తప్పనిసరిగా రెండేళ్ల పాటు మెడికల్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుందని, ఇది పూర్తయిన తర్వాత మాత్రమే ఆ వైద్య విద్యార్థులు రిజిస్ట్రేషన్ పొందగలరని తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా వైద్య విద్యను మధ్యలోనే వదులుకున్న విద్యార్థులు 29 దేశాల్లో ఎక్కడైనా కొనసాగించుకునే వెసులుబాటు కల్పిస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. దాదాపు 22 వేల మంది విద్యార్థులలో ఎక్కువ శాతం మంది వైద్య విద్య అభ్యసించేందుకు ఉక్రెయిన్ వెళ్లారు. భారత్‌లో కంటే ఉక్రెయిన్‌లో తక్కువ వ్యయం అవుతుండటంతో వైద్య విద్యను అభ్యసించాలనుకున్న వారు ఆ దేశానికి వెళ్లారు. అయితే ఉక్రెయిన్ - రష్యా యుద్ధం వారి ఆశలపై నీళ్లు చల్లింది. దీంతో అక్కడ చిక్కుకుపోయిన విద్యార్థులను భారత్ ప్రభుత్వం విమానాల్లో సురక్షితంగా తీసుకొచ్చింది.

శివసేన ముఖ్యనేతగా ఏక్‌నాథ్ శిందే

ముంబై: శివసేన పార్టీ 'ముఖ్య నేత'గా ఏక్‌నాథ్ శిందేను అధికారికంగా ప్రకటించారు. ఎన్నికల సంఘం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే వర్గాన్ని నిజమైన శివసేనగా గుర్తించి, వారికి 'విల్లు-బాణం' గుర్తును అనుమతించిన తర్వాత, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిందే నేతృత్వంలో మంగళవారం సాయంత్రం ముంబైలో జరిగిన మొదటి జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. 'శివసేన పార్టీ అధినేత శిందే. ఆయనను శివసేన నాయకుడిగా అంగీకరిస్తున్నాం' అని మహారాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సమంత్ అన్నారు. పార్టీ క్రమశిక్షణా సంఘం అధిపతిగా మంత్రి దాదా భూసే, సభ్యులుగా శంభురాజ్ దేశాయ్, సంజయ్ మోరే నియమితులయ్యారు. ఈ సమావేశంలో పార్టీ కార్యదర్శిగా సిద్ధేష్ కదమ్‌ను నియమించాలని కూడా నిర్ణయించారు. శివసేనలో పార్టీ చీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని రద్దు చేశారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసేవారు క్రమశిక్షణా కమిటీని ఎదుర్కోవాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలని, రాష్ట్రంలో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని, వీరమాత అహల్యాబాయి హోల్కర్, ఛత్రపతి శంభాజీ రాజే పేర్లను దేశ ప్రముఖుల జాబితాలో చేర్చాలని, మరాఠీకి శాస్త్రీయ భాష హోదా కల్పించాలని, ముంబైలోని చర్చ్‌గేట్ స్టేషన్‌కు చింతామన్‌రావ్ దేశ్‌ముఖ్ పేరు పెట్టాలని కోరుతూ తదితర తీర్మానాలను సమావేశంలో ఆమోదించారు.

ఢిల్లీలో భూప్రకంపనలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో బుధవారం భూకంపం సంభవించింది. నేపాల్ కేంద్రంగా సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.8గా నమోదైంది. నేపాల్‌లో ఈ భూకంపం తీవ్రత 5.2గా నమోదైనట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ప్రభావం ఉత్తరప్రదేశ్‌లోనూ కనిపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. నేపాల్‌లోని బజురలో బుధవారం మధ్యాహ్నం 1.45 గంటలకు భూకంపం సంభవించినట్లు నేపాల్ జాతీయ భూకంప పర్యవేక్షక, పరిశోధన కేంద్రం వెల్లడించింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హరియాణా, ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1:30:23 గంటలకు భూకంపం ప్రభావం కనిపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం హరిద్వార్‌లో ఉన్నట్లు పేర్కొంది. అకస్మాత్తుగా భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు.

శివసేన పేరు, గుర్తు వివాదం

ఈసీ ఆదేశాలపై స్టేకు సుప్రీం తిరస్కృతి

న్యూఢిల్లీ: శివసేన పార్టీ పేరు, ఎన్నికల గుర్తును శిందే-శివసేనకు కేటాయిస్తూ ఎన్నికల సంఘం (ఈసీ) ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించేందుకు సర్వోన్నత న్యాయస్థానం బుధవారం తిరస్కరించింది. ప్రస్తుతానికి ఏక్‌నాథ్ శిందే వర్గానికి శివసేన పేరు, బాణం-విల్లు గుర్తు చెల్లుతుందని, ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి కాలుతున్న కాగడా గుర్తు, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పేరు కొనసాగుతుందని చెప్పింది. గతేడాది పార్టీలో చీలిక ఏర్పడినప్పటి నుంచి పార్టీ పేరు, గుర్తుపై వివాదం కొనసాగుతూనే ఉంది. తాజాగా ఉద్ధవ్ ఠాక్రే వర్గం ఫిర్యాదును విచారించిన సర్వోన్నత న్యాయస్థానం 'ప్రస్తుత దశలో ఎన్నికల కమిషన్ ఆదేశాలపై స్టే విధించలేం' అని పేర్కొంది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ ధర్మాసనం ఠాక్రే తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌కు ఈ మేరకు మౌఖికంగా తెలిపారు. పార్టీ కార్యాలయాలు, ఆస్తులు, బ్యాంకు ఖాతాలనూ సైతం శిందే వర్గం కబ్జా చేసుకుంటుందని, అలా జరగకుండా రక్షణ కల్పించాలని ఠాక్రే వర్గం తరఫున న్యాయవాదులు సిబల్, ఏంఏ సింఘ్వీ అభ్యర్థించారు. సుప్రీంకోర్టు ఈ విషయంలో ఎలాంటి ఆదేశాలివ్వలేదు. శిందే వర్గానికి పార్టీ పేరు, గుర్తును కేటాయిస్తూ ఈసీ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కేసు తమ వద్దకు వచ్చిందని సీజేఐ అన్నారు. 'ఇది రాజకీయ పార్టీ మధ్య ఒప్పంద పూర్వక సంబంధం. ఎన్నికల కమిషన్ నిర్ణయం ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ఏమీ ఉండదు. అలా జరిగితే మీరు (ఠాక్రే) మీకు చట్టబద్ధంగా ఉన్న అవకాశాలను అన్వేషించుకోవాలి' అని వెల్లడించారు. ... అంటే శిందే నేతృత్వ శివసేన తీసుకోబోయే తదుపరి చర్యలను ఠాక్రే విడిగా సవాల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఠాక్రే పిటిషన్‌పై తమ వైఖరిని వెల్లడిస్తూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు శిందే వర్గానికి రెండు వారాల గడువు ఇస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. అలాగే, ప్రతిస్పందనకు ఠాక్రే వర్గానికి వారం గడువు ఉంటుందని తెలిపింది. ఆ తర్వాత కేసు లిస్టింగ్ చేస్తారన్నది. ఎన్నికల సంఘం తమ విషయంలో వివక్షపూరితంగా, అన్యాయంగా వ్యవహరిస్తోందని, చట్టానికి - విధి ధర్మానికి కట్టుబడటం లేదంటూ ఠాక్రే ఇంతముందు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 'నన్ను నిలువనా దోచుకున్నారు. మా పార్టీ పేరు (శివసేన), గుర్తు (బాణం-విల్లు) దోచుకున్నారుగానీ 'ఠాక్రే' పేరును దోచుకోలేదు' అని ఆయనన్నారు. 2024లో జరగబోయే లోక్‌సభ ఎన్నికలే దేశంలో చిట్టచివరి ఎన్నికలని, ఆ తర్వాత నియంత శకం మొదలవుతుందని, ఇక ఎన్నికలు ఉండవబోవని ఠాక్రే అన్నారు.

అత్యవసర విచారణను పరిశీలిస్తాం

హిజాబ్ వ్యవహారంపై సుప్రీం

న్యూఢిల్లీ: కర్ణాటకలోని విద్యాసంస్థల్లో హిజాబ్‌పై నిషేధం కొనసాగుతోంది. అయితే మార్చి9 నుంచి ఆ రాష్ట్రంలో పరీక్షలు జరగబోతున్నాయి. హిజాబ్ ధరించే అమ్మాయిలు దీనిపై సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హిజాబ్‌తో పరీక్షలకు అనుమతించాలని కోరారు. ఈ వ్యవహారాన్ని తక్షణమే విచారణకు స్వీకరించాలని విద్యార్థులు విన్నవించారు. దీనిపై సీజేఐ డీవై చంద్రచూడ్ స్పందిస్తూ కేసు లిస్టింగ్‌పై నిర్ణయం తీసుకుంటానని, త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తానని బుధవారం హామీనిచ్చారు. కర్ణాటకకు చెందిన హిజాబీ విద్యార్థుల బృందం తరఫున న్యాయవాది షాదాన్ ఫరాసత్ కోర్టులో వాదనలు వినిపించారు. ఈ వ్యవహారాన్ని తక్షణమే విచారించాలని కోరారు. 'వాళ్లను ఎందుకు పరీక్షకు అనుమతివ్వడం లేదు' అని సీజేఐ ప్రశ్నించగా 'హెడ్‌స్కార్ఫ్‌లు ధరించినందుకు' అని న్యాయవాది బదులిచ్చారు. సీజేఐ స్పందిస్తూ దీనిపై త్వరలోనే నిర్ణయిస్తానని చెప్పారు. జనవరి 23న ఇదే తరహా పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలైంది. హిజాబ్ ధరించే విద్యార్థులను పరీక్ష రాయనివ్వకపోవచ్చన్న న్యాయవాది మీనాక్షి అరోరా వాదనలతో... ఈ అంశాన్ని పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. భిన్నతీర్పు క్రమంలో త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటు చేయాలని అరోరా కోరారు. ఫిబ్రవరి 6వ తేదీ నుంచి మొదలయ్యే పరీక్షల దృష్ట్యా ఆమె అత్యవసర విచారణకు విన్నవిస్తే పరిశీలిస్తామన్న న్యాయస్థానం త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటు కోసం రిజిస్ట్రార్‌కు నోటీసు ఇచ్చింది. గతేడాది అక్టోబరు 13న ద్విసభ్య ధర్మాసనం హిజాబ్ నిషేధంపై భిన్నతీర్పు వెలువరించింది. పెద్ద ధర్మాసనం ఏర్పాటు కోసం ఈ వ్యవహారాన్ని సీజేఐ పరిశీలనకు సూచించింది. ఇస్లాం సంప్రదాయం ప్రకారం హిజాబ్ తప్పనిసరి కాదని 2022, మార్చి15న కర్ణాటక హైకోర్టు తీర్పు ఇచ్చింది.

సంజయ్ సుపారీ ఆరోపణలు..నిజం కాదని తేలితే చర్యలు తప్పవు

పుణె: తనను చంపించేందుకు ముఖ్యమంత్రి కుమారుడు సుపారీ ఇచ్చినట్లు శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే స్పందించారు. 'మేం పౌరులకు భద్రత కల్పించేందుకు కట్టుబడి ఉన్నాం. అయితే ఇలాంటి సున్నితమైన అంశాలతో ఆటలాడుకోవాలని ప్రయత్నిస్తే మాత్రం చర్యలు తప్పవు' అని హెచ్చరించారు. తనను చంపేందుకు శిందే కుమారుడు ఓ నేరస్థుడికి సుపారీ ఇచ్చారంటూ ముంబయి పోలీసు కమిషనర్‌కు సంజయ్ రౌత్ ఫిర్యాదు చేశారు. 'నన్ను చంపించేందుకు థాణెకు చెందిన రాజా ఠాకూర్ అనే ఓ నేరస్థుడికి లోక్‌సభ సభ్యుడు శ్రీకాంత్ శిందే సుపారీ ఇచ్చారు. ఈ విషయంపై నాకు విశ్వసనీయ సమాచారం ఉంది. బాధ్యత కలిగిన పౌరుడిగా నేను మీకు సమాచారం ఇస్తున్నాను' అని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రౌత్ సుపారీ ఆరోపణలపై ఎన్‌సీపీ నేత సుప్రియా సూలే స్పందించారు. 'రౌత్ చెప్పిన విషయం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర హోం మంత్రి దీనిపై విచారణకు ఆదేశించాలి' అని అన్నారు.

షటిల్ సర్వీసు ఫీజు రద్దు చేయాల్సిందే!

ఏపీయూ విద్యార్థుల నిరాహారదీక్ష

బెంగళూరు: షటిల్ సర్వీసుకు అధిక మొత్తంలో ఫీజు వసూలు చేయడాన్ని నిరసిస్తూ అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ (ఏపీయూ) విద్యార్థులు ఆందోళనకు దిగారు. తొమ్మిది రోజుల నిరసన అనంతరం విద్యార్థులు బుధవారం నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభించారు. హాస్టల్ సౌకర్యాన్ని ఎంచుకున్న మొదటి సంవత్సరం విద్యార్థులందరికీ వర్తింపచేస్తున్న రూ. 8500 సెమిస్టర్ షటిల్ ఫీజును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పేర్కొనని అదనపు ఫీజులను డిమాండ్ చేయడం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనలకు విరుద్ధమని విద్యార్థులు చెబుతున్నారు. అంతేకాకుండా, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు యూనివర్సిటీ హాస్టల్‌ను సిద్ధం చేయడం వల్ల ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. యూనివర్సిటీ క్యాంపస్‌లో హాస్టల్ లేదు. చాలామంది ప్రధాన క్యాంపస్ నుంచి 2-3 కిలోమీటర్ల దూరంలో ఉన్న అపార్ట్‌మెంట్లను లీజుకు తీసుకున్నారు. ఈ మార్గంలో వీధి దీపాలు లేక ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. 2022లో అనేక మంది విద్యార్థులు లైంగిక వేధింపుల గురించి ఫిర్యాదు చేయడంతో, ఏపీయూ... విద్యార్థులను హాస్టల్ నుంచి తీసుకోవచ్చి మరల తీసుకెళ్లేందుకు షటిల్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. రోజుకు దాదాపు 12 ట్రిప్పులు ఉన్నాయి. తాము షటిల్ సర్వీసు నుంచి వైదొలగలేమని, యూనివర్సిటీ నిర్ణయించిన ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని మొదటి సంవత్సరం విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అయితే, షటిల్‌లో సీటు దొరక్క క్యాంపస్/హాస్టల్‌కు చేరుకోవడానికి నడవడం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు. హాస్టల్‌లో దాదాపు 400 మంది విద్యార్థులు ఉంటున్నారు. సంగం (పేరు మార్చబడింది) అనే విద్యార్థి న్యూస్‌క్లిక్‌తో మాట్లాడుతూ... 'తొమ్మిది రోజుల నిరసన తర్వాత, మేము చివరకు మంగళవారం వైస్ ఛాన్సలర్ ఇందు ప్రసాద్‌ని కలిశాం... అయితే మా పిటిషన్‌ను కూడా చదవకుండా, షటిల్ ఫీజును రద్దు చేయలేమని ఆమె ప్రకటించారు. అంతేకాకుండా వచ్చే వారం యూనివర్సిటీ ఫెస్ట్ జరగనున్నందున దీక్షా శిబిరాన్ని క్యాంపస్ వెలుపలికి తరలించాలని ఆమె మాకు చెప్పారు' అన్నారు. మరో విద్యార్థి సోను మాట్లాడుతూ... (పేరు మార్చాం) కిక్కిరిసిన హాస్టల్ గది గురించి మాట్లాడాడు. ఫోన్‌లో న్యూస్‌క్లిక్‌తో మాట్లాడుతూ, '2 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్‌లో ఆరుగురు విద్యార్థులు ఉంటున్నారు. వంటగది ప్రాంతాన్ని తాత్కాలిక బెడ్‌రూమ్‌గా మార్చేసి ఇద్దరు అక్కడ నిద్రించడం వల్ల ఇది సాధ్యమైంది. ఆరుగురు విద్యార్థులు రెండు బాత్‌రూమ్‌లను పంచుకోవాల్సి వస్తోంది. అంతేకాదు హాస్టళ్లు ఉన్న ప్రాంతం సురక్షితం కాదు. ఈ సౌకర్యాల కోసం, విశ్వవిద్యాలయం మానుంచి రూ.42,000 వసూలు చేస్తోంది' అని చెప్పారు. తమ సమస్యలను చెప్పుకునేందుకు బహిరంగ సభ నిర్వహించాలని విద్యార్థులు ఏపీయూ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈ సమావేశం గురువారం జరిగే అవకాశం ఉంది.

ఉత్తుత్తి సుజల స్రవంతి

15 ఏళ్లయినా పైసా కేటాయింపు లేదు

శిలాఫలకం తప్ప ఇక్కడ ఏమీ లేదు

రామకృష్ణ మండిపాటు

విశాలాంధ్ర-కె.కోటపాడు (అనకాపల్లి జిల్లా): బాబు జగజ్జీవన్ రామ్ సుజల స్రవంతి ప్రాజెక్టు ఉత్తరాంధ్ర ప్రజలకు కలగా మిగిలిపోయేలా ఉందని, అధికారులు కాగితాల్లో అద్భుతంగా చూపిస్తున్నారు తప్ప వాస్తవానికి ఇది ఏ మాత్రం ముందుకు సాగటం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా బుధవారం రామకృష్ణ అధ్వర్యంలో పార్టీ ప్రతినిధి బృందం అనకాపల్లి జిల్లా కే కోటపాడు మండలంలో సుజల స్రవంతి ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను పోలవరం కెనాల్ అనకాపల్లి డివిజన్ ఇంజినీర్ పి.ఉషారాణి సీపీఐ బృందానికి తెలిపారు. అనంతరం మీడియా ప్రతినిధులతో రామకృష్ణ మాట్లాడుతూ 2008లో ఎంతో అట్టహాసంగా శంకుస్థాపన చేసిన సుజల స్రవంతి పనులు ఇప్పటికీ మొదలుపెట్టలేదన్నారు. ఉత్తరాంధ్రపై సీతకన్ను వేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధులు విడుదల చేసి పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం నుండి వచ్చే ఎడమ కాలువ ద్వారా కే కోటపాడు మండలంలో ఉన్న భూదేవి ప్రాజెక్టు ప్రాంతంలో 6.57 టీఎంసీల నీటిని నిలువ చేస్తారని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 79 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించవచ్చన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో తాగునీటికి, సాగునీటికి ఢోకా ఉండదని అన్నారు. ఇటువంటి బృహత్తరమైన ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయకుండా నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బృందంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ, దేగా ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.విమల, సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు డీసీహెచ్ క్రాంతికుమార్, జి.గురుబాబు, బి.సుబ్బలక్ష్మి, ఆర్.అప్పలరాజు, చెరకు రైతు సంఘం ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు, మండల కార్యదర్శి గొర్లే దేవుడి బాబు, ఇల్లాకు రాము, రెడ్డి అప్పల నాయుడు, శ్రీముసురు సూర్యనారాయణ, రాము నాయుడు, పొంతపల్లి రామారావు తదితరులు ఉన్నారు.

ప్రాజెక్టులను గాలికొదిలేసిన జగన్ సర్కార్

విశాలాంధ్ర-కశింకోట (అనకాపల్లి జిల్లా): నాలుగేళ్లుగా సాగునీటి ప్రాజెక్టులను జగన్ సర్కార్ గాలికి వదిలేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం పోలవరం ఎనిమిదవ ప్యాకేజీ ఉత్తరాంధ్ర సృజల స్రవంతి ప్రాజెక్టును సీపీఐ రాష్ట్ర బృందం బుధవారం పరిశీలించింది. ముందుగా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను మ్యాప్ ద్వారా అధికారులు వివరించారు. అనంతరం రామకృష్ణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై ప్రచారమే తప్ప పనులు ప్రారంభం కాలేదన్నారు. రిజర్వాయర్ పనులు గానీ, మెయిన్ కెనాల్ పనులు గానీ జరగడం లేదని ఆరోపించారు. నిర్మాణ దశలో ఉన్న చిన్నచిన్న ప్రాజెక్టులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణమని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు, దేగా ప్రభాకర్, మధు, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు ఎ.విమల, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, కార్యవర్గ సభ్యులు గురుబాబు, రాజబాబు, అప్పలరాజు, సుబ్బలక్ష్మి, మండల కార్యదర్శి సత్తిబాబు, కొండలరావు, ఫణీంద్ర, రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన గవర్నరు అబ్దుల్ నజీర్‌కు సీఎం స్వాగతం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నరుగా నియమితులైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు బుధవారం గన్నవరం విమానాశ్రయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి అబ్దుల్ నజీర్ దంపతులు చేరుకున్నారు. అక్కడ గవర్నరు పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈనెల 24వ తేదీన నూతన గవర్నరు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు రాజ్‌భవన్ అధికారులు వెల్లడించారు.

ఘోర రోడ్డు ప్రమాదం : ఐదుగురు మృతి

ఇద్దరి పరిస్థితి విషమం... ఆరుగురికి గాయాలు

విశాలాంధ్ర-కొమరాడ/పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అక్కడికక్కడే నలుగురు మహిళలు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరొకరిని 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖపట్టణం తరలించారు. వివరాలను పరిశీలిస్తే... మన్యం జిల్లాలోని కొమరాడ మండలంలో అంటివలస గ్రామానికి చెందిన 13 మంది అదే మండలంలోని తుమ్మలవలస గ్రామానికి శుభకార్యానికి ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మండలంలోని చోల్లపథం మలుపు వద్ద రాష్ట్ర రహదారిపై పార్వతీపురం నుంచి రాయగడ వైపు వెళుతున్న లారీ ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో నుజ్జయి అందులో ప్రయాణిస్తున్న వారంతా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు.

అక్కడికక్కడే నలుగురు మహిళలు మృత్యువాత పడ్డారు. మరో ముగ్గురికి తలకు తీవ్ర గాయాలు, ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులందరినీ వెంటనే 108 వాహనాల్లో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రి నుంచి విశాఖపట్టణం రిఫర్ చేసినట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి చెప్పారు. స్వల్పంగా గాయపడిన ఆరుగురు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు. ఈ ప్రమాదంలో వుయ్యక నరసమ్మ (40), వుయ్యక లక్ష్మి (42), మెల్లిక శారద (35), మెల్లిక అమ్మడమ్మ (40), ఉయ్యక వెంకటి (55) మృతి చెందగా, డ్రైవర్ వుయ్యక వెంకటేష్, వుయ్యక రామస్వామి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయానంద్ చేరుకొని మృతదేహాలను, క్షతగాత్రులను పార్వతీపురం తరలించే చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వారితో పాటు కొమరాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి ఆసుపత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ ప్రమాదంలో ఉయ్యక లక్ష్మి మృతి చెందగా ఆమె భర్త ఉయ్యక రామస్వామి పరిస్థితి కూడా విషమంగానే ఉంది. ఈ ప్రమాదంలో రెండేళ్ల చిన్నారికి మాత్రం ఎటువంటి గాయాలు తగలకపోవడం గమనార్హం.

ప్రభుత్వ ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడదాం

బిడ్డల భవిష్యత్‌ని కాపాడదాం

ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ అరాచకాలు, అన్యాయాలపై ప్రశ్నించే ప్రజలు, ప్రజా సంఘాలు, వారి పక్షాన పోరాడే ప్రతిపక్షాలు అణిచివేతకు గురైతే అంతిమంగా నష్టపోయేది సామాన్య ప్రజలేనని, ఈ పోరాటంలో అందరం కలిసి రాష్ట్రాన్ని, ప్రజల భవిష్యత్తును కాపాడుకోవడానికి సమష్టి తిరుగుబాటుతో ప్రభుత్వ ఉగ్రవాదాన్ని ఎదుర్కొందామని, తద్వారా మనతో పాటు మన బిడ్డల భవిష్యత్‌ని కాపాడుకుందామని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ విడుదల చేశారు. రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వ అరాచక, విధ్వంసకర పాలనలో ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. జగన్‌మోహన్ రెడ్డి నియంత పోకడలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారాయి. ప్రజా వ్యతిరేక పాలనను ప్రశ్నిస్తే... ప్రజలు, ప్రతిపక్షాలపై దాడులు, కేసులు, హింసాత్మక ఘటనలు, పోలీసు వేధింపులు అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఇందుకు గన్నవరం విధ్వంసం ఒక తాజా ఉదాహరణ. గన్నవరం ఘటనలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై, పార్టీ నేతల ఇళ్లపై, కార్యకర్తలపై దాడులు చేసి వారి ఆస్తులు ధ్వంసం చేయడంతో పాటు వారినే పోలీసు వేధింపులకు గురిచేసి... ఆ బాధితులనే నిందితులుగా మార్చి, జైలుకు పంపిన వైనంపై వాస్తవాలు మీ దృష్టికి తేవడానికే ఈ లేఖ రాస్తున్నానని తెలిపారు. వైసీపీ అరాచక పాలనతో ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. జీవితాంతం కష్టపడి పేదలు సంపాదించుకున్న ఆస్తులను కబ్జా చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకుల, కార్యకర్తల నిర్బంధాలు, అక్రమ కేసులు... బడుగు, బలహీన, దళిత, మైనారిటీ వర్గాలకు వేధింపులు, మహిళలపై అకృత్యాలకు రాష్ట్రం వేదికగా మారింది. పన్నులపై ప్రజలు ప్రశ్నిస్తే కేసులు, జాబ్ క్యాలెండర్ గురించి గళమెత్తితే నిరుద్యోగ యువతకు వేధింపులు, ధాన్యం బకాయిలు అడిగితే రైతులకు బేడీలు, జీతాలు అడిగితే ఉద్యోగులకు బెదిరింపులు అన్నట్లు పరిస్థితి మారింది. కోవిడ్ సమయంలో మాస్కులు అడిగిన డాక్టర్ సుధాకర్... మద్యంపై ప్రశ్నించిన ఓం ప్రతాప్ ప్రాణాలు తీశారు. ఇసుక మాఫియాను ప్రశ్నించిన వరప్రసాద్‌కు పోలీస్ స్టేషన్‌లోనే శిరోముండనం చేశారు. ఇలాంటి ఘటనలు ఈ పాలనలో కోకొల్లలు జరిగాయని ఉదహరించారు. ఇలాంటి సందర్భంలో రాష్ట్రంలో ఉన్న దారుణ పరిస్థితులపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి తాను చేపట్టిన పర్యటనలకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తోంది. దానికి భయపడిన ఈ ప్రభుత్వం... అనపర్తి సభకు అడ్డంకులు సృష్టించింది. అయినా నాడు సహాయ నిరాకరణ ఉద్యమంలో మహాత్మా గాంధీజీ చేసిన దండి మార్చ్ స్ఫూర్తితో నేను 7 కిలో మీటర్లు నడిచి అనపర్తి మార్చ్ నిర్వహించాను. అనపర్తి సభ విజయవంతం కావడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా అనపర్తిలో ఏకంగా వెయ్యిమంది టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టారు. ఆంక్షలు, నిర్బంధాలు ఉన్నా అద్భుతంగా జరిగిన సభతో ఉలిక్కిపడిన జగన్... హింసాత్మక ఘటనలతో ప్రజల, ప్రతిపక్షాల గొంతు నొక్కకపోతే ఇక లాభం లేదని భావించి... గన్నవరం విధ్వంసానికి పాల్పడ్డారని ఆ లేఖలో వివరించారు. యావత్ సమాజం విస్తుపోయేలా బాధితులైన టీడీపీ కార్యకర్తల పైనే హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు. శాంతి భద్రతలు పరిరక్షించాల్సిన పోలీసుల చేతనే తప్పుడు కేసులు పెట్టించి, తన వికృత రాజకీయానికి పావులుగా వాడుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ధర్మానికి, అధర్మానికి... ప్రజాస్వామ్యానికి, నియంత పోకడలకు మధ్య యుద్ధం జరుగుతోంది. సమష్టి తిరుగుబాటుతో ప్రజాస్వామ్యాన్ని, రాష్ట్రాన్ని, బిడ్డల భవిష్యత్తును కాపాడుకుందామని చంద్రబాబు పిలుపునిచ్చారు.

ఎయిరిండియా విమానం అత్యవసర ల్యాండింగ్

న్యూఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది. సాంకేతికలోపం కారణంగా సుమారు 300 మంది ప్రయాణికులతో బయల్దేరిన న్యూయార్క్-ఢిల్లీ విమానం స్వీడన్‌లోని స్టాక్‌హోంలో దిగింది. ఒక ఇంజిన్‌లో ఆయిల్ లీక్ కావడంతో ఈ విమానాన్ని దారి మళ్లించినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. దాంతో అప్రమత్తమైన విమానాశ్రయ వర్గాలు భారీగా ఫైరింజన్లను సిద్ధంగా ఉంచాయి. ఆయిల్ లీక్ కావడంతో ఒక ఇంజిన్ పనిచేయడం ఆగిపోయింది. తర్వాత అప్రమత్తంగా వ్యవహరించిన పైలట్ విమానాన్ని స్టాక్‌హోంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. తనిఖీల్లో భాగంగా ఒక ఇంజిన్ నుంచి ఆయిల్ కారడం కనిపించిందని తెలిపారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని చెప్పారు. సోమవారం ఉదయం కూడా ఎయిరిండియా విమానం ఒకదాన్ని దారిమళ్లించారు. వైద్య అత్యవసర పరిస్థితి తలెత్తడంతో న్యూయార్క్- ఢిల్లీ విమానం లండన్‌లో దిగింది.

టెస్టు ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్

టాప్-5లో ముగ్గురు భారత క్రికెటర్లు

లండన్: ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఆటగాళ్లు సత్తా చాటారు. ఏకంగా ముగ్గురు ఆల్‌రౌండర్లు టాప్ 5లో చోటు దక్కించుకున్నారు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 406 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా సిరీస్‌లో అదరగొడుతున్న స్పిన్ మాంత్రికుడు రవిచంద్రన్ అశ్విన్ (376 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచాడు. బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీ రెండు టెస్టుల్లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన అక్షర్ పటేల్ (283 పాయింట్లు) ఐదో స్థానానికి ఎగబాకాడు. ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో ముగ్గురు భారత క్రికెటర్లు చోటు దక్కించుకోవడం ఇదే మొదటిసారి.

టాప్ 5 లిస్ట్ ఇదే...

1. రవీంద్ర జడేజా (భారత్) 460 పాయింట్లు
2. రవిచంద్రన్ అశ్విన్ (భారత్)376 పాయింట్లు
3. షకిబుల్ హసన్ (బంగ్లాదేశ్) 329 పాయింట్లు
4. బెన్ స్టోక్స్ (ఇంగ్లండ్) 320 పాయింట్లు
5. అక్షర్ పటేల్ (భారత్) 283 పాయింట్లు

ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో కూడా అశ్విన్ (864 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచాడు. వరల్డ్ నంబర్ 1 బౌలర్ జేమ్స్ అండర్సన్ (866 పాయింట్లు)కు, అశ్విన్‌కు రెండు పాయింట్లు తేడా ఉంది అంతే. ఇండోర్ టెస్టులో అశ్విన్ చెలరేగితే అండర్సన్‌ను వెనక్కి నెట్టి నంబర్ 1 ర్యాంకు అందుకోవడం ఖాయం. దాదాపు ఐదు నెలల విరామం తర్వాత జట్టులోకి వచ్చిన జడేజా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి రెండు టెస్టుల్లో అదర గొట్టాడు. అశ్విన్‌తో కలిసి ఆస్ట్రేలియా బ్యాటర్లను వణికించాడు. స్పిన్‌కు అనుకూలించిన నాగ్‌పూర్, ఢిల్లీ పిచ్‌లపై వీళ్లు చెలరేగారు. అశ్విన్, జడ్డూ కలిసి రెండు మ్యాచుల్లో 31 వికెట్లు పడగొట్టారు. మొదటి టెస్టులో వీళ్లు 15 వికెట్లు తీయడంతో ఆసీస్ ఇన్నింగ్స్ 132 రన్స్‌తో ఓడిపోయింది. ఢిల్లీ టెస్టులో జడ్డూ పది వికెట్ల ప్రదర్శన చేశాడు. అతను ఈ ఫార్మాట్‌లో 10 వికెట్లు తీయడం ఇది రెండోసారి. అంతేకాదు ఒకే ఇన్నింగ్స్‌లో ఐదుగురిని బౌల్డ్ చేసి 21 ఏళ్ల క్రితం అనిల్ కుంబ్లే నెలకొల్పిన రికార్డును సమం చేశాడు. తొలి రెండు టెస్టుల్లో నెగ్గిన భారత్ నాలుగు టెస్టుల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో ఉంది. మూడో టెస్టు ఇండోర్‌లో మార్చి 1న జరగనుంది. ప్రపంచటెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఇండియా ఈ మ్యాచ్‌లో కూడా తప్పనిసరిగా గెలవాలి. మూడో టెస్టులోనూ విజయం సాధిస్తే భారత జట్టు దర్జాగా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుతుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా ఫైనల్ బెర్తు ఖరారు చేసుకున్న విషయం తెలిసిందే. జూన్‌లో జరగనున్న డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఇంగ్లండ్ లోని ఓవల్ స్టేడియం వేదిక కానుంది.

'ఉగ్రం' టీజర్ విడుదల

హైదరాబాద్: అల్లరి నరేశ్ నటించిన ఉగ్రం సినిమా టీజర్ బుధవారం విడుదలైంది. కామెడీ, సీరియస్ స్టోరీలతో ఇప్పటివరకు అభిమానులను పలకరించిన అల్లరి నరేశ్... ఈ సారి మాత్రం కాస్త రూటు మార్చి యాక్షన్ థ్రిల్లింగ్ కథాంశంతో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నట్టు టీజర్‌తో అర్థమవుతోంది. నాంది ఫేం విజయ్ కనకమేడల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లరి నరేశ్ పోలీస్ గెటప్‌లో యాక్షన్ అవతార్‌లో కనిపిస్తున్న విజువల్స్‌తో టీజర్ మొదలైంది. నాది కాని రోజు కూడా నిన్ను లాగి నిలబెడతా... అర్థమైందా? అంటూ కాప్ గెటప్‌లో నరేశ్ చెప్తున్న డైలాగ్స్ ఆకట్టుకుంటున్నాయి. సినీ అభిమానులు అల్లరి నరేశ్‌లో ఇదివరకెన్నడూ చూడని సరికొత్త కోణాన్ని ఈ సినిమాలో చూడబోతున్నట్టు టీజర్‌తో తెలిసిపోతుంది. ఈ చిత్రంలో మలయాళ భామ మిర్నా కథానాయికగా నటిస్తోంది. ఉగ్రం సినిమాకు టూమ్ వెంకట్, అబ్బూరి రవి కథ, మాటలు అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది తెరకెక్కిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల అందిస్తున్న బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం సినిమాకు హైలెట్‌గా నిలవబోతున్నట్టు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ మూవీ మే 5న థియేటర్లలో సందడి చేయనుండగా.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ముగింపు దశకు హిందీ 'ఛత్రపతి'

హైదరాబాద్: టాలీవుడ్ లో 'అల్లుడు శీను' నుంచి 'అల్లుడు అదుర్స్' వరకూ బెల్లంకొండ శ్రీనివాస్ జోరు కొనసాగింది. హిట్, ఫ్లాప్ అనే విషయాలను పక్కనే పెడితే, ఆయన సినిమాలన్నీ భారీ బడ్జెట్ తో రూపొందినవే. స్టార్ హీరోయిన్స్ తో సైతం ఐటమ్ సాంగ్స్ చేయించినవే. అలాంటి బెల్లంకొండ శీను, 'ఛత్రపతి' హిందీ రీమేక్ కోసం రంగంలోకి దిగాడు. వినాయక్ దర్శకత్వంలో ఇలా ప్రాజెక్టును పూర్తి చేసి అలా వచ్చేద్దామని వెళ్లాడు. అయితే కారణాలేవైనా ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. మొత్తానికి చిత్రీకరణ పరంగా ఈ సినిమా ముగింపు దశకి చేరుకుంది. ఈ వేసవిలో ఈ సినిమాను విడుదల చేయాలనే నిర్ణయానికి వచ్చారట. ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు. తెలుగులో 2005లో రాజమౌళి దర్శకత్వంలో చేసిన 'ఛత్రపతి' ... ప్రభాస్ కెరియర్‌కి తోడ్పడింది.

మహిళల టీ20 ప్రపంచకప్

నేడు సెమీస్‌లో

భారత్-ఆసీస్ ఢీ

ముంబై: దక్షిణాఫ్రికాలో జరుగుతున్న మహిళల టీ20 వరల్డ్ కప్ తుది అంకానికి మరో అడుగు దూరంలో ఉంది. రెండు గ్రూపుల నుంచి సెమీఫైనల్ బెర్తులు ఖరారు అయ్యాయి. గ్రూప్-1లో ఆస్ట్రేలియా, గ్రూప్-2లో ఇంగ్లండ్ జట్లు వరుస విజయాలతో పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచాయి. మొదటి గ్రూప్‌లో దక్షిణాఫ్రికా, రెండో గ్రూప్‌లో భారత్ రెండో స్థానంలో ఉన్నాయి. వీటిలో ఏయే జట్లు సెమీస్ పోరులో తలపడనున్నాయో తెలుసా..? మొదటి సెమీ ఫైనల్లో ఫిబ్రవరి 23న భారత్, ఆస్ట్రేలియా జట్లు తలపడనున్నాయి. మరుసటి రోజు (ఫిబ్రవరి 24న) ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా రెండో సెమీఫైనల్ ఆడతాయి. వీటిలో ఏ టీమ్‌లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయో అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఐర్లాండ్‌తో కీలకమైన చివరి గ్రూప్ మ్యాచ్‌లో భారత్ అదరగొట్టింది. ఓపెనర్ స్మృతి మంధాన హాఫ్ సెంచరీ (87) బాదడంతో 155 రన్స్ చేసింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో భారత్ డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఐదు పరుగులతో ఐర్లాండ్‌పై గెలుపొందింది. ఆరు పాయింట్లతో సెమీస్ బెర్తు ఖాయం చేసుకుంది. పొట్టి ప్రపంచకప్‌లో టీమిండియా సెమీఫైనల్ చేరడం ఇది నాలుగోసారి. ఇంతకుముందు 2009, 2010, 2018లో భారత జట్టు సెమీస్‌లో అడుగుపెట్టింది. ఇంగ్లండ్ జట్టు పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో ప్రపంచ రికార్డు సృష్టించింది. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నాట్ సీవర్ బ్రంట్ (81), వ్యాట్ (59) ఇద్దరూ అర్ధ శతకాలతో చెల రేగడంతో 5 వికెట్ల నష్టానికి 213 చేసింది. ఛేజింగ్‌లో పాకిస్థాన్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 99 రన్స్ చేసిందంతే. దాంతో, ఇంగ్లడ్ 114రన్స్‌తో విజయం సాధించింది.

టాటా గ్రూప్ చేతికి డబ్ల్యూపీఎల్ టైటిల్ హక్కులు

ముంబై:: మహిళా క్రికెట్‌లో సరికొత్త అధ్యాయంగా పేరొందిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మొదటి సీజన్ హక్కులను టాటా గ్రూప్ దక్కించుకుంది. ఈ లీగ్ ఐదు సీజన్లకు కూడా ఈ కంపెనీయే స్పాన్సర్‌గా ఉండనుది. 2027 జూలై వరకు టాటా గ్రూప్ టైటిల్ స్పాన్సర్‌గా కొనసాగుతుంది. డబ్ల్యూపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులను టాటా కంపెనీకి కట్టబెడుతున్నట్టు బీసీసీఐ అధికారింగా ధ్రువీకరించింది. ఈమేరకు ట్విట్టర్‌లో పోస్ట్ కూడా పెట్టింది. 'మహిళల ప్రీమియర్ లీగ్ ఆరంభ సీజన్ టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులను టాటా గ్రూప్ దక్కించుకుందని చెప్పడానికి చాలా సంతోసిస్తున్నా. వాళ్ల మద్దతుతో మహిళా క్రికెట్‌ను మరో స్థాయికి తీసుకెళ్తామనే నమ్ముతున్నాం' అని బీసీసీఐ సెక్రటరీ జై షా ట్వీట్ చేశాడు. ఇప్పటికే టాటా గ్రూప్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ టైటిల్ స్పాన్సర్‌గా ఉన్న విషయం తెలిసిందే. డబ్ల్యూపీఎల్ మీడియా హక్కులను ఐదేళ్ల కాలానికి వైకోమ్ సంస్థకు బీసీసీఐ కట్టబెట్టింది. ఈమధ్యే ముగిసిన డబ్ల్యూపీఎల్ వేలంలో భారత ఓపెనర్ స్మృతి మంధాన రికార్డు ధర పలికింది. ఆమెను రూ.3.44 కోట్లకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కొనుగోలు చేసింది. విధ్వంసక ఓపెనర్ షఫాలీ వర్మ రూ. 2 కోట్లు పలికింది. షఫాలీతో పాటు జేమీమా రోడ్రిగ్స్ (రూ.2.2 కోట్లు)ను ఢిల్లీ క్యాపిటల్స్ కొన్నది. బీసీసీఐ తొలిసారిగా నిర్వహిస్తున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మార్చి 4న ముంబైలో ప్రారంభం కానుంది.

తమిళ నటుడు ప్రభుకు అస్వస్థత

చెన్నై: ప్రముఖ తమిళ నటుడు ప్రభు తీవ్ర అస్వస్థతకు గుర య్యారు. కడుపులో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని వెంటనే చెన్నై లోని కొడంబక్కంలో గల మెడ్ వే ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన తర్వాత కిడ్నీలో రాళ్ల కారణంగా నొప్పి వచ్చిందని వైద్యులు గుర్తించారు. లేజర్ సర్జరీ చేయడం ద్వారా ప్రభు కిడ్నీలో రాళ్లు తొలగించారు. ఆయన ఆరోగ్యం గురించి వైద్యులు హెల్త్ బులిటెన్ కూడా విడుదల చేశారు. ప్రస్తుతం ప్రభు ఆరోగ్యం నిలకడగా ఉందని, రెండు మూడు రోజుల్లో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నటుడు ప్రభు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'చంద్రముఖి', రెబల్ స్టార్ ప్రభాస్ 'డార్లింగ్', యంగ్ టైగర్ ఎన్టీఆర్ 'శక్తి', మెగా మేనల్లుడు పంజా వైష్ణవ్ తేజ్ 'రంగ రంగ వైభవంగా' తదితర చిత్రాల్లో నటించారు. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన విజయ్ 'వారసుడు' సినిమాలో కూడా కనిపించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.